## బుభుక్షితః కిం న కరోతి

# పుణ్యం?

మాదిగ పల్లెలోని బుజ్జోడి పొయ్యికీ, బ్రాహ్మణవీధిలోని రామానుగ్రహశాస్త్రి పొయ్యికీ, ఏమి సంబంధం? బుజ్జోడి పొయ్యి ఒక పక్క పొంతకుండ, రెండుపక్కలా మట్టిదిమ్మెలతో ఉంది. ఇక్కడ కూర్చుని వంటచేయాలి. రామానుగ్రహ శాస్త్రి పొయ్యి అరుగుమీద ఉన్న కిరోసిను స్టౌ. అక్కడ నిలబడి వంటచేయాలి. బుజ్జోడి తల్లి కూర్చుని వంట చేసీ చేసీ కూర్చోలేకుండా, నిలబడలేకుండా ఉంది. రామానుగ్రహశాస్త్రి నిలబడి వంటచేసీ చేసీ విసిగి కూర్చుని వంట చేసుకొంటే బాగుంటుందని భావిస్తున్నాడు.

బుజ్జోడు వీధిబడిలో అయిదోతరగతి పిల్లవాడు. రామానుగ్రహశాస్త్రి వేణుగోపాలస్వామి దేవాలయం పూజారి. అతడికి పదేళ్ళుంటే, ఇతడికి అరవైఏళ్ళు. అతడు దుమ్ము గొట్టుకొని తిరిగే ఆగమ్మ కాకయితే, ఇతడు నిత్యం వేద పఠనం చేసే నైష్ఠికుడు. బుజ్జోడి అక్షరాలు తెలుగువి. శాస్త్రి పదాలు సంస్కృతానికి. ఈజన్మలోకానీ ఇంతకు ముందు జన్మలోకాని ఒకరినొకరు ఎరుగరు. అయితే వీళ్ళకు ఏమి సంబంధం?

❊ ❊ ❊

మాదిగ పల్లెలో రెండువందల గడప ఉంది. అంతా కాయకష్టం చేసి బతికేవాళ్ళే! వేసవి. ఎండలు ముదిరాయి. పనులుండవు. పస్తులుంటాయి.

బుజ్జోడికి బడిలో ఏదో పేరు ఉండిఉంటుంది. అయ్యవారు హాజరు పిలుస్తుంటాడు. వాడు పలుకుతుంటాడు. బడి వెలుపల వాడిపేరు ఇదే! ఎవరు పిలిచినా ఇదే! దీన్ని పిలిస్తేనే వాడు పలుకుతాడు. బడిలో ఈ పేరు పిలిస్తే 'ప్రజంటు సార్!' అనడు. ఆ పేరు పిలవాలి. అందరూ అతణ్ణి బుజ్జీ, బుజ్జీగా, బుజ్జయ్య, బుజ్జిబాబు అని పిలుస్తారు, ముద్దుగా, తల్లి మాత్రం బుజ్జోడా అంటుంది తండ్రి కన్నా అంటాడు.

వాళ్ళకు వీడు లేకలేక కలిగాడు. ఆమె ముక్కోటి దేవతలకు మొక్కుకొంది. ఆమె మునగని గంగ లేదు. ఎక్కని కొండలేదు. పూజించని రాయిలేదు. దర్శించని గుడిలేదు. ప్రదక్షిణం చేయని ప్రాకారం లేదు. దండం పెట్టని గుడి గోపురం లేదు. పెళ్ళయిన పదిహేనేళ్ళకు పుట్టాడు బుజ్జోడు.

వాడు వాళ్ళకు ముద్దులకొడుకు. మురిపాల మూట. ముచ్చట్ల రచ్చబండ. వాడి నడకా సొగసే, మాటా ముద్దే, పరుగూ ముచ్చటే! వాడు పడినా సంతోషమే! పలకరించినా పరమానందమే!

ఈ వేసవి గడిస్తే వాడు అయిదోతరగతి. ఇటువంటి వేసవులు మరో పది గడిస్తే కొడుకు మూతి మీద మీసం వస్తుంది. గవర్నమెంటు ఉద్యోగం వస్తుంది. ఇంటికి కోడలు వస్తుంది. కోడిపిల్లల్లా ఇంటినిండి మనవళ్ళు మనవరాళ్ళు కువకువలాడుతూ తిరుగుతారు. ఇల్లంతా కళకళలాడుతూ ఉంటుంది. పార్వతమ్మకీ కల పాతికేళ్ళ నుంచి ఉంది. పదేళ్ళనుండి వృద్ధి చెందుతూ ఉంది. మరో పదేళ్ళకు నెరవేరుతుంది.

వాడికి ఆకలి అద్భుతమయిన వరం. ఏంతిన్నా జీర్ణమవుతుంది. ఎంత తిన్నా ఆకలి మిగిలే ఉంటుంది. కృష్ణుడు ఎన్ని ఇళ్ళలో వెన్ననెయ్యి పెరుగుపాలు దొంగిలించి తాగినా తిన్నా ఆకలి అవుతూనే ఉండేది. ఏం తిన్నా జీర్ణమవుతూనే ఉండేది. బుజ్జోడు శ్రీకృష్ణపరమాత్ముడంతటి మొనగాడై చక్రం తిప్పుతాడని ఆమె విశ్వాసం. మన్నుతిన్నా అరిగించుకొనే ఆరోగ్యం.

బుజ్జోడు పొరుగిళ్ళ ఉట్టులు కొట్టడుగానీ, పల్లెలో ఎవరేం పిలిచిపెట్టినా క్షణాల్లో తినేస్తాడు. పొలాల్లో కాయా కసురు, తినదగిందేమి దొరికినా తింటాడు. చిన్నప్పుడు మట్టి తిన్నాడని పార్వతమ్మ బుగ్గలు పిండి పాలుగారుతున్నాయని ఏడ్చి, ప్రేమగా, కోపంగా, ముద్దుగా, లాలనగా మట్టితినొద్దని అచ్చంగా యశోదమ్మలాగా బ్రతిమాలింది. బుజ్జోడు ఏమన్నా దేవుడా అమ్మమాట అక్షరాలా పాటించాడు. ఎప్పుడూ మట్టి జోలికి పోలేదు. ఎంత ఆకలయినా కానీ, కడుపు కాలిపోనీ, ఏడుపయినా రానీ మట్టి ముట్టలేదు.

బుజ్జోడు కృష్ణుడులాగే నల్లగా ఉండేవాడు. నిగనిగలాడే నలుపు, కారు నలుపు, తారునలుపు, కాటుక నలుపు, చీకటి నలుపు, నలుపు నారాయణమూర్తి. వీడు కూడా కృష్ణ పరమాత్ముడులాగా పదహారు వేలమంది మాదిగ సుందరాంగుల్ని పెళ్ళాడాలని, ఎనిమిదిమంది కోడళ్ళు తనతో ఇంటిలో ఉండాలని, వాళ్ళందరికి పురుళ్ళు తానే పోయాలని, వాళ్ళంతా బిలబిలమంటూ తిరుగుతూ ఉండాలని, తన కొడుకు పిల్లలు, మనవళ్ళు, మనవరాళ్ళు, మునిమనవళ్ళు, ముని మనుమరాళ్ళు ఒక ఊరంత ఉండాలని పార్వతమ్మ కల. కమ్మని కల! పిచ్చికల. పిచ్చికత! అదేకల, అదే కత, పదే పదే, అదే కల, ఇదే మన్నా న్యాయమా?

ఆమె భర్త వేసవిలో పొలం పనుల్లేక, విజయవాడ - గుంటూరు రోడ్డు వెడల్పు పనులు జరుగుతుంటే, రోడ్డు పనికి పోయాడు. బసవయ్యకు వ్యవసాయం కొట్టినపిండి. రోడ్డుపని తనవల్లకాదు. మట్టిపనేకదా, ఫరవాలేదని పోయాడు. వ్యవసాయం పనులు ఏడాదిలో ఆరునెల్లే! బసవయ్యకు ఎంతో పొలంలేదు. ఉన్నంతలో తృప్తి. ఎవరిపనికయినా పోతాడు. అతడికి పనిపట్ల శ్రద్ధ. ఆరోగ్యంగా ఉన్న మనిషి. ఎంతపనయినా చేస్తాడు. వాళ్ళు ఆరునెల్లు సంపాదించుకొంటారు. ఆరునెల్లు తింటారు. సంవత్సరం గడుస్తుంది. మళ్ళీ మొదలు. కానీ మూడో నోరు ఇంట్లో మొలిసిన కాడ నుంచి పనిభారం పెరిగింది. పెద్దనోరు. ఆనాటి బాయంత పెద్దది. మోటబావి అంత ఉంటుంది. ఆ బావుల్లో నీరు ఎంత తోడినా తరగదు. వీడి ఆకలి ఎంత తిన్నా తీరదు. బుజ్జోడికి కడుపునిండా తిండి పెట్టడం ఒక యజ్ఞం. కనీసం అన్నమయినా పెడితే అదే పుణ్యం.

పొద్దుట నిద్రలేచిన దగ్గర్నుంచి 'అమ్మా ఆకలీ' అంటూ ఉన్నాడు. రాత్రి కూడా సరిగా పెట్టలేదు. బుజ్జోడికి క్వారీ తిరనాళ్ళంటే చాలా ఇష్టం. కావలసిందల్లా తినవచ్చు.

గరువున మిట్ట ఉంది. దానిమీద శివాలయం ఉంది. దానిముందు నందీశ్వర విగ్రహం ఉంది. శివరాత్రికి ఆడపెద్ద తిరనాళ్ళ జరగుతుంది. బుజ్జోడు తినగలిగినన్ని తినుబండారాలు దొరుకుతాయి.

శివాలయం చుట్టూ క్వారీ పని జరుగుతూ ఉంటుంది. రాయి, కంకర ఇళ్ళు కట్టడానికి అక్కడనుంచి సరఫరా అవుతుంటాయి. అక్కడ ఎప్పుడూ పని ఉంటుంది. కొంత కాలం బసవయ్య అక్కడా పని చేస్తాడు సంవత్సరంలో.

అది పెద్దదేంకాదు కానీ, అతిప్రాచీనమయిన శివాలయం. ఎంత లేదన్నా ఎనిమిది వందలేళ్ళకు పూర్వం దాన్ని కట్టి ఉంటారు. శివరాత్రి నాడు తప్ప అక్కడేమీ పూజా పునస్కారాలు జరగవు. అది వడ్లమూడికి దగ్గర. అంతకంటే గరువు పాలేనికి దగ్గర. సంగం జాగర్లమూడికి కూడా దూరమే. సుద్దపల్లికి కొంచెం చేరువ. వేజండ్లకూ కోదూరుకూ దూరమేకాని పెద్దదూరం ఏమీకాదు. చుట్టూ పాతికగ్రామాల వాళ్ళు తిరునాళ్ళకు వస్తారు. వచ్చేవాళ్ళు ఊరికేరారు. ప్రభలు కట్టుకొని వస్తారు. పేదవాళ్ళు వీపుకు కట్టుకొని, ఉన్నవాళ్ళు బళ్ళకు కట్టుకొని వస్తారు. మనిషి మోసే ప్రభలు, మేకపోతులు, గొర్రెపోతులు మోసేప్రభలు, రెండెడ్ల బళ్ళమీద వచ్చే ప్రభలు, నాలుగైదు జతల ఎడ్లు లాగితే వచ్చే ప్రభలు చూడచక్కగా ఉంటాయి. ఏవూరి ప్రభ ఎత్తుగా ఉందని జనం తరచి తరచి చూడటం, ఆవూరు ప్రభ ఈ ఏడు అన్ని ప్రభలకంటే ఎత్తు ఉందని చెప్పుకోవటం ఒక గొప్ప.

ఎత్తైన ప్రభలు తెచ్చేటప్పుడు చేసే ఏర్పాట్లు చూడటం బుజ్జోడికి ఇష్టం. పాతికమంది మోకులు కట్టి పట్టుకొనేవాళ్ళు, ఏపక్కకువొరిగి పోకుండా ఎడ్లు లాగుతున్న బండిమీద నిటారుగాప్రభ నిలబడి ఉండేట్లు చూడడం గొప్ప చాకచక్యం. కరెంటు వైర్లు, టెలిఫోను వైర్లు అడ్డువచ్చినప్పుడు ప్రభల్ని వంచి తీసుకురావటమో వాటిని తెంచి తేవటమో వాళ్ళు తేలికగా చేసేవాళ్ళు. ప్రతిప్రభతో ఒక బాండు మేళం ఉండేది. అన్ని ప్రభలతో అన్ని మేళాలతో గుడి హోరెత్తి పోయేది. హరా హరా శివ శివా, హరహర మహదేవా! అని భక్తులు భక్తినాదాలు మిన్నుముట్టేవి.

ప్రభల్ని చూడటం, భక్తనాదాలు వినటం ఎంతో సంతోషం. ఎంతో ఆనందం. ఎంతో ముచ్చట. ఎంతో వేడుక. ఎంతో ఉత్సాహం. ఎంతో ఉత్సవం. అద్భుతంగా ఉండేది. తండ్రి భుజమెక్కి అటు ఇటూ కాళ్ళు ఆరజాపి పడకుండా తండ్రి జుట్టు పట్టుకుని కూర్చోవటం ఆశ్చర్యంగా ఉండేది.

ఎర్రగరువు దుమ్ములో ధూళిలో పగలూ రాత్రి తిరుగుతూ ఉండటం వినోదం. వాడికి చెరుకు గడలు రంగులరాట్నాలు, టమటమాల బండ్లు మహాప్రీతి. జిలేబి, కారప్పూస,

మైసూరుపాకు ముక్కలు, బూందిలడ్డు, చక్రాలు, అరిసెలు, పాకంపప్పు, సెనగపప్పు, సెనగలు, బఠాణీలు, ఏవో తింటూ, చెరుకు గడలు నములుతూ చెరుకు రసంతాగుతూ, ప్రభల వెలుగులు చూస్తూ, భక్తనాదాలు వింటూ, మిరుమిట్లు గొలిపే కాంతులు చూస్తూ, కదుపునిండా తినొచ్చు. మంగళగిరి పానకాలరాయుడికి ఎంతతాగినా తృప్తి లేనట్లు, బుజ్జోడు ఎంతతిన్నా కడుపు ఖాళీగా ఉంటుందని ఎవరో అనేమాట అబద్ధం. తిరనాల రోజు బుజ్జోడి బొజ్జ పూర్తిగా నలుమూలలా దిశదిశలా నిండిపోయేది. అందువల్ల వాడికి క్వారీ తిరునాళ్ళే అంటే ప్రాణం. మంగళగిరి పానకాల రాయుడి గుడి, క్వారీ శివాలయం ఎత్తు ఒకటేనని జనం అంటారు. కానీ ఇది నేలమీద ఉంది. అది కొండమీద ఉంది. జలప్రళయం వస్తే అది మునిగినాకే ఇది మునుగుతుందనేవాళ్ళు.

తిరునాళ్ళు శివరాత్రినాడే! ఏడాది పొడుగునా గుడిలో ఏ ఉత్సవం పూజ ఉండవు. గుడిలో బుద్ధిముట్టిచ్చే అతిగతీ కూడా ఉండదు. ఎండకూ వానకూ ఎండుతూ, తడుస్తూ బీదవాడి ఎద్దులాగా ఉసూరుమంటూ ఉంటాడు నందీశ్వరుడు. శివుడికే లేని పూజ నందికేడ నుంచి వస్తుంది.

* * *

శివాలయంలో పూజలు చేసే ఆరాధ్యుడు మరణించగా అతడి కొడుకు జంగమదేవర పూజలు చేసేవాడు. ఆ పూజారి లేకపోగా శరభయ్య పూజ జరిపించేవాడు. అతడి కడగొట్టు కొడుకే రామానుగ్రహశాస్త్రి. సంవత్సరానికి ఒకసారి ధూపదీప నైవేద్యాది తతంగం జరిపించేవాడు శాస్త్రి. శాస్త్రి కాలానికి శివరాత్రి మాహాత్మ్యం మాయం కాసాగింది. శివమాహాత్మ్యమే కనిపించడం లేదు. నందికి దిక్కేముంది?

శరభయ్యకు పన్నెండుమంది పిల్లలు. ముక్కోటి దేవతలపేర్లు అతడికి కంఠోపాఠమని ప్రసిద్ధి. అయితే పన్నెండుమంది పిల్లలకు అసలు పేర్లు, ముద్దుపేర్లు, చిన్నపేర్లు అన్నీ అతడికి గుర్తులేవు. చివరివాడు రామానుగ్రహశాస్త్రి. అతణ్ణి శాస్త్రి అనీ, రామా అనీ, అనూ అని, చిన్నా అని, చిన్నోడని పిలుస్తారు.

దేవుళ్ళు కొండలు, కోనలు, నదులు వదిలి వూళ్ళలోకి వచ్చి ప్రజల సౌకర్యార్థం పట్టణాలలోకి గ్రామాలలోకి వచ్చి స్థిరపడడం మొదలైనప్పుడే వేజండ్లలో ఊర జెరువుగట్టు మీద దేవాలయం పుట్టింది, వేణుగోపాలస్వామి వెలిశాడు. శైవం వీరశైవంగా మారినప్పుడు, వైష్ణవం, వీర వైష్ణవంగా రూపొందినప్పుడు ఈ గుడి పుట్టలేదు.

క్వారీ శివాలయానికి మూడుమైళ్ళ దూరంలో నల్లరేగడి. ఎర్రగరువు కలుస్తున్నచోట పొలం పనులకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఇళ్ళు కట్టుకొంటున్నప్పుడు దేవాలయం అవసరం గుర్తించిన పూజారులు గుడి కట్టించి, వేయి జండాలతో అలంకరించి, గుడికి

వేణుగోపాలస్వామి గుడి అని, ఊరుకు వేయి జండాలని పేరు పెట్టి పూజకు ప్రారంభించారు. కాలక్రమంగా వేయిజండాలు వేజండ్లగా మారి ప్రసిద్ధిమయింది.

అమరావతి జమీందార్లు, కొండపల్లి కొండవీడు పాలకులు, చింతపల్లి జమీందారిణి తలా ఒక చేయి వేయగా వేయి జండాలపురి వేణుగోపాలస్వామి దేవాలయం ఒక వెలుగు వెలిగింది. గుడి నిర్మాణానికి చేయూతనిచ్చిన సంపన్నులందరి పేరిటి ఒక్కొక్క గుడ్డ జండా కుట్టించి దండగా కట్టి దేవాలయం ప్రారంభం నాడు ఎగురవేశారు. ప్రతిఏటా శ్రీరామనవమికి మళ్ళీ వాటిని ఎగురవేస్తున్నారు. ఆసంప్రదాయం అవి చిరిగి ముక్కలయినా అమలు జరుగుతూనే ఉంది.

తంజావూరు సరస్వతి మహలు గ్రంథాలయంగా మారుతన్నప్పుడు తమిళనాడు వదిలి, గుంటూరు జిల్లా వేజండ్ల గ్రామం వచ్చి, తమిళం మర్చిపోయి, తెలుగు నేర్చుకొని, గుడి అర్చకబాధ్యతలు చేపట్టి, రోజంతా భజనకీర్తనగా, కోలాటం పాటగా పాడుకొనే పెద్దగీతం వ్రాశాడు పెరుమాళ్ళు. దేవాలయ అర్చక బాధ్యతలు నిర్వహిస్తు పెరుమాళ్ళు తనను తాను వేణుగోపాలస్వామి దాసు అని పిలుచుకోసాగాడు. ప్రజల మాత్రం పెరుమాళ్ళ దాసు అని చెప్పుకొనేవాళ్ళు. దాసు వ్రాసినపాట వేజండ్లలో అందరికీ ఎంతోకొంత కంఠోపాఠంగా ఉండేది.

సామి రారా, నాసామిరారా

వేజండ్లపురీ వేణుగోపాల రారా!

నా సామి రారా నా బంగారుసామి రారా

అనే పాట అద్భుతంగా సాగేది. వేయి చరణాల పాట ఒక్కొక్క చరణంలో ఒక్కో సంపన్న భక్తుడి వితరణ శీలం, గుణగణాలు, వంశగౌరవమర్యాదలు సూచనగా తెలుపుతూ సాగింది.

పెరుమాళ్ళదాసు ఆజన్మ బ్రహ్మచారి కావటం వల్ల అతడి తదనంతరం దేవాలయ పూజాపునస్కారాలు నిర్వహించటానికి శరభయ్యను శాస్త్రి అని పిలిచి, తన వారసుడుగా నిలపి, అతడి చేతుల్లో శతవృద్ధుడుగా కాలంచేశాడు.

పెరుమాళ్ళ దాసు పెంచిన శరభయ్య అంతదాకా క్వారి శివాలయ పూజారి వంశవారసుడుగా ఉండేవాడు. పెరుమాళ్ళ దాసు పెంపకంలో వేణుగోపాలస్వామి దేవాలయ పూజారి అయ్యాడు. అయినా అటు శైవం, ఇటు వైష్ణవం ఏకధాటిని ఒక్కచేతిమీదగా నిర్వహించి హరిహరాద్వైతం పాటించాడు.

రాబడిలేని క్వారి శివాలయం వదిలి, వెలుగు వెలుగుతున్న వేణుగోపాలస్వామి పూజారిగా స్థిరపడి పోయాడు. పెరుమాళ్ళ దాసే మధురనుంచి సద్బ్రాహ్మణ కుటుంబ కన్యను తెచ్చి శరభయ్యశాస్త్రికి పెళ్ళిచేశాడు. వేణుగోపాలస్వామి కృపాకటాక్షం వల్ల శరభయ్యశాస్త్రికి

పన్నెండుమంది పిల్లలు కలిగారు. అందరు కలిగాక, ఆమె ఆరోగ్యం క్షీణించి చిన్నవయస్సులోనే కాలం చేసింది.

శరభయ్య శాస్త్రి సంతానంలో ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి భర్తలతో వెళ్ళిపోయారు. వాళ్ళు తల్లులు, అవ్వలు, ముత్తవ్వలు, అయి పసుపు కుంకాలతో నిత్య సౌభాగ్యవతులుగా విరాజిల్లుతూ ఉన్నారు. కొడుకులు పెళ్ళిళ్ళయి, జీవనమార్గం వెతుక్కొంటూ దేశాలు పట్టుకుపోయి, దొరికిన ఉద్యోగాలలో స్థిరపడి తండ్రులై, తాతలై, ముత్తాతలై ఖ్యాతీప్రఖ్యాతులు పేరూ ప్రతిష్ఠలు తెచ్చుకొని సుఖంగా ఉన్నందువల్ల పుట్టిన ఊరును, కన్నతండ్రిని, చిట్టచివరి తమ్ముణ్ణి వాళ్ళు గుర్తుచేసుకొనే పరిస్థితులు కలగలేదు.

వృద్ధాప్యంలో ఒంటరి వాడయిన పెరుమాళ్ళదాసును, ఒంటరివాడయిన శరభయ్యశాస్త్రి కాపాడుకొంటూ వచ్చినట్లు, నూరేళ్ళదాకా బతికిన తండ్రిని అరవయేళ్ళ రామానుగ్రహశాస్త్రి సంరక్షించుకొంటూ వచ్చాడు. పూర్ణాయుష్కుడుగా పూర్తి జీవితం జీవించి శరభయ్య శాస్త్రి కాలం చేశాడు.

వీళ్ళిద్దరికి వంటచేసి పెట్టడానికి మనిషి అవసరమని గుర్తించిన శరభయ్యశాస్త్రి రామానుగ్రహశాస్త్రికి పెళ్ళి చేయటం కోసం, కానూరులో పుల్లాభొట్ల వారింటి అందాల బరిణెను తెచ్చి పెళ్ళి అంగరంగ వైభవంగా చేశాడు. ఆ అమ్మాయికి ఏం జబ్బో, కాపురానికి వచ్చిన మూడు నెలలకే హరీ అనో, హరా అనో అంది. హరి అందని రామానుగ్రహశాస్త్రి హరా అందని శరభయ్యశాస్త్రి వితర్కించుకొన్నారు.

రామానుగ్రహశాస్త్రి పుట్టిన కొద్దిరోజులకే చనిపోయిన భార్యను తలుచుకొంటూ కొడుకును పెంచాడు. తనకప్పట్లో నలభైఏళ్ళు. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని శరభయ్య శాస్త్రి భావించాడు. ఇరవై మొదలు ఒక ఏడాది దాకా పిల్లలు మెట్లుమెట్లుగా ఉంటే, తనకు పెళ్ళాం రాగలదు, వంటచేసి మనిషిగా ఉండగలదు కాని పిల్లలకు తల్లిగా ఉండగలదా లేదా అని తర్కించి, సవతితల్లిని తెచ్చి లేనిపోని తలనొప్పి తెచ్చుకోవటం ఎందుకని మానేశాడు పెళ్ళి ప్రస్తావన.

భార్య గతించిన సంవత్సరాంతంలో రామానుగ్రహశాస్త్రికి శరభయ్యశాస్త్రి పాత గుంటూరునుంచి జమ్ములమడకవాళ్ళు అమ్మాయిని తెచ్చి అంత ఘనంగా కాకపోయినా వైభవంగానే పెళ్ళిచేశాడు. ఆ మహాలక్ష్మి సంపన్నుల బిడ్డ కావటంతో సంసారానికి రాలేదు. కాపరానికి పంపమంటే అల్లుణ్ణి ఇల్లరికం తెచ్చుకోవాలని ఉంది అని జమ్ములమడుక జగదీశ్వర శర్మ ప్రస్తావించాడు. వేణుగోపాలస్వామి దేవాలయం బరువు బాధ్యతలు మోస్తున్న కుటుంబం మాది కాబట్టి ఇల్లరికం అవకాశం లేదన్నాడు శరభయ్య శాస్త్రి. ఏతావాతా మాటామాట పెరిగి మహాలక్ష్మి కాపరానికి రాలేదు. రామానుగ్రహ శాస్త్రి ఇల్లరికం పోలేదు. గుడి సేవ దక్కింది. భార్యాసేవ తప్పింది.

రాముడు భార్యతో పద్నాలుగేళ్ళు అడవిలో ఉన్నాడు, సుఖశాంతులున్నాయో లేదో తెలియదు, పిల్లలు కలగలేదు. కొంతకాలం లంకలో, మరికొంత కాలం వాల్మీకి సంరక్షణలో, ఆపైన భూమాత ఒడిలో ఆమె నివాసం. రాముడు సీతతో రాజభోగాలు అనుభవించిన కాలం చాలా తక్కువ. రామానుగ్రహశాస్త్రి కంటే రాముడే నయం. రాముడి అనుగ్రహం ఉండడం వల్ల మరికొంతకాలమైనా భార్యా వియోగం లేకుండా ఉండి ఉండవలసింది. మూడు నెలలు సంసారం. అచ్చటముచ్చట తీరలేదు. రెండోపెళ్ళి రెండురోజులు కూడా నిలవలేదు. సీతా వనవాసంలాగా, మహాలక్ష్మికి పాత గుంటూరు వాసం తప్పలేదు.

ఇంట్లో నుంచి క్రమక్రమంగా ఒక్కొక్కరు వెళ్ళి పోతూ రావటంతో తమ ఇరవై ఏళ్ళనాటికే, భార్యలేని, భార్య కాపురానికి రాని, భర్తగా మిగిలిపోయాడు రామానుగ్రహశాస్త్రి. తండ్రికి అరవై ఏళ్ళు. తండ్రికి సేవచేసే భాగ్యం శ్రీహరి ప్రసాదించడం వల్ల రామానుగ్రహశాస్త్రి వృద్ధ పితృదేవుడికి వండి వార్చి వడ్డించే నేర్పుసంపాదించాడు. పాకశాస్త్ర ప్రవీణుడయ్యాడు. పాకవిద్య పారంగతుడయ్యాడు. వంటనేర్పరి అయ్యాడు. తండ్రి కొడుకు చేతివంట తప్ప అన్యం ముట్టని అకుంఠిత ఆచార సంపన్నుడయ్యాడు. రామానుగ్రహ శాస్త్రి చేయితిరిగిన పేరుప్రతిష్ఠలున్న వంట లక్కలనే ఏమిటి నలభీమాదుల్ని తలదన్నె వంట విద్యా విశారదుడయ్యాడు.

రామానుగ్రహ శాస్త్రికి ఈ వంట ప్రావీణ్యం రావటానికి అద్భుతమైన అతడి ఆకలే కారణమని తండ్రికీ కొడుక్కీ తెలుసు. రుచిగా, శుచిగా వంట చేసుకొని తృప్తిగా తండ్రికి వడ్డించి, పరమతృప్తిగా తానుతిని, సుఖపడటం నేర్చుకొన్నాడు రామానుగ్రహశాస్త్రి. భార్యలేక, వండిపెట్టే తల్లిలేక, ఇంటబద్ధ విధవాదపడుచులు లేక, వంటలక్కలు దొరక్క, చేయి కాల్చుకోసాగిన కొడుకు వంటలో ఆరితేరటం తన అదృష్టంగా శరభయ్యశాస్త్రి భావించుకోసాగాడు. తండ్రీకొడుకులు ఇష్టమయినవి వండుకొని, ఇష్టమయినంత సిద్ధం చేసుకొని ఇష్టమయినంత సేపు తిని త్రేన్పటం వల్ల తండ్రి తిండి పుష్టితో నూరేళ్ళు బతికాడు.

వేణుగోపాలస్వామి నైవేద్యమంతా ఆవంటగదిలో రామానుగ్రహశాస్త్రి చేతులమీదుగా సిద్ధమయ్యేది. రెపరెపలాడటం వల్ల చిరిగిపోతాయని తీసి అటకమీద దాచిపెట్టిన జండాలన్నీ సంవత్సరానికి ఒకసారి కూడా తీయటం మానేశారు. తృప్తిగా తినే రామానుగ్రహశాస్త్రి భోజనప్రీతిని పరవశంగా పరికించి పట్టరాని ఆనందంతో గాలివచ్చినప్పుడవి అటకమీద నుంచే రెపరెప చప్పట్లు కొట్టేవి.

## 2

బడి పిల్లవాడు బుజ్జోడికి, పూజారి రామానుగ్రహశాస్త్రికి ఏం సంబంధం? ఇద్దరిదీ భోజన పరాక్రమం విశేషమయిందంటే అంగీకరింపవచ్చు. అంతేనా అంతకంటే ఏమైనా సంబంధం ఉందా? ఉంటే ఏం సంబంధం?

అతడికి తల్లి తండ్రి ప్రేమ ఉంది. ఇతడికి తండ్రి అనురాగం అద్భుతంగా ఉంది.

అతడికి దేవుణ్ణి గూర్చి తెలియదు. పూజారికి దేవుడి సమస్త విషయాలు సమగ్రంగా తెలుసు.

వాళ్ళిద్దరికీ ఇంకా ఏమన్న సంబంధం ఉందా? బుజ్జోడికి రామానుగ్రహశాస్త్రికి అర్ధశతాబ్ది ఎడం ఉంది వయస్సులో.

వీళ్ళద్దరిదీ ఏం సంబంధం?

※ ※ ※

'అమ్మా ఆకలే! అమ్మా ఆకలే!' అంటూ బుజ్జోడు తల్లి కాళ్ళకూ చేతులకూ అడ్డం వస్తున్నాడు, కదలనీడు, కూర్చోనీడు. ఏ పనీ చేసుకోనీడు. దిక్కుతోచకుండా చేస్తున్నాడు.

కొడుకు ఆకలి తల్లికి తెలుసు. రోజూ ఈపాటికి వండి పెట్టేది. ఇంట్లో బియ్యం పప్పు అన్నీ అడుగంటాయి. బసవయ్య డబ్బుతెస్తాడు. బియ్యం కందిపప్పు తెచ్చుకోవచ్చునని ఆమె ఎదురుచూస్తూఉంది. రాత్రే రావలసిన మనిషి తెల్లారినా రాలేదు. ఆదివారం రోడ్డు పనికిసెలవు. శనివారం బట్వాడా ఇచ్చేస్తారు. లారీలు పట్టుకొని గుంటూరు, బుడంపాడు కోడూరు మీదగా వచ్చినా రాత్రే వచ్చేవాడు. పని నంబూరు దగ్గర. అడ్డం పడివస్తే దగ్గరే! పొలాలలోనుంచి రావాలి. పార్వతమ్మకు ఆందోళనగా ఉంది.

'అమ్మా ఆకలీ' అని పిల్లవాడు నడుంపట్టుకొని వేలబడుతున్నాడు. వాడి ముఖం పీక్కుపోయినట్లుంది. తిన్నాదాకా ఆకలి ఆకలి అంటాడు, తిన్నాక ఆగమ్మ కాకిలా ఎగిరిపోతాడు. వాడి కాళ్ళూ చేతులూ నోరూ ఆడుతూ ఉండవలసిందే. వాడి నోరు పిండిమర, నోట్లో ఏం పడ్డా పిండిపిండి అయిపోతుంది.

'దరిద్రుడికి ఆకలెక్కువ' అని తిట్టబోయి, చాలాసార్లు తమాయించుకోసాగింది పార్వతమ్మ. తిట్టదు. వాడే తమ వంశాంకురం. తమ వంశవృద్ధికి వాడే మూలం. వాణ్ణి ఏమన్నా అంటే నోరు పడిపోదు!

కొడుకు గోల తట్టుకోలేక బియ్యం డబ్బా మూతతీసి చూసింది. బియ్యం అడుగంటాయి. ఆమె డబ్బాలో నుండి గిద్దతో బియ్యం తీస్తుంది. గిద్దతో రాకపోతే బియ్యం లేనట్లే! చేయి పెట్టి తీయదు. డబ్బా బోర్లించి బియ్యం చేటలో పోసుకోదు. బోర్లించడం ఇష్టం ఉండదు. అది అరిష్టమనుకొంటుంది.

బుజ్జోడి గోల భరించలేక చేయిపెట్టి మూలలు వెతికి గుప్పెడు గుప్పెడు బయటకి తీసింది. రెండు గిద్దలు దాకా ఉన్నాయి బియ్యం. చేటలో పోసుకొని ఏరుతూ ఉంది. గుప్పెడు-కందిపప్పు ఉంటే బైటికి తీసింది.

బియ్యం చెరిగింది. తవుడు పొట్టు ఊక ఎగిరిపోయాయి. చేటలో బియ్యం నెరుముతూ ఉంది. రాయీ రప్ప అడుక్కు వస్తాయి. బియ్యం చేటంతా పరిచి, నల్లమట్టి పెడ్డలు ఏరి నోట్లో వేసుకొంటూ ఉమున్తూ ఉంది.

తల్లి వంట చేసే పనిలో ఉండటంతో బుజ్జోడికి సంతోషంగా ఉంది. తల్లికెదురుగా బాచిపట్టువేసుకొని కూర్చుని 'అమ్మా బియ్యంలో మట్టిబెడ్డలు ఎందుకుంటాయి?'

'వడ్ల కంకులకు, రేగడి నేల మట్టి అతుక్కుపోతే, మరకు పట్టిచ్చినప్పుడు మట్టి పెడ్డలు వస్తాయి'

'మేలే!'

'ఏం మేలురా?'

'తెల్లబియ్యం, నల్లబెడ్డలు, ఏరటం తేలిక!'

'నీ ముఖం!'

వాడింక మాట్లాడలేదు.

పార్వతమ్మ, బియ్యం శుభ్రం చేసింది. కుండ కడిగింది. చేటలో బియ్యం చెరిగింది. కుండలో బియ్యం పోసి, నీళ్ళు పోసి అత్తెసరు పెట్టబోయేముందు, శంభుదాసు వచ్చాడు. రాగానే ఆహారదీక్ష చెబుతాడని భయపడింది. భయం నిజం అయ్యే సూచన లేదుకానీ, అబద్ధమయ్యే అవకాశం కూడా కనిపించటం లేదు. అందువల్ల బియ్యం ఎసట్లో పొయ్యకుండా ఆపింది.

శంభుదాసు మాదిగల పూజారి. మాదిగల ఉపకులమైన మాదిగ దాసులకు చెందినవాడు. మాదిగదాసులు అమిత నిష్ఠాగరిష్ఠులు. మాదిగల ఇళ్లలో శుభకార్యాలు నిర్వహించే పూజారులు.

మాదిగ దాసులు నిజానికి మాదిగల దాసులే! మాదిగల రాజరికం కాలంలో వీళ్ళు పూజారి వర్గం, శుభాశుభాలు నిర్ణయించేది వీళ్ళే. ఆర్యుల రాకతో క్రమక్రమంగా ఓటమి పాలయిన ఒకనాటి పాలకులు కారాగార శిక్ష పొంది, తరతరాలుగా సంఘబహిష్కృతులైనా, వాళ్ళకు దైవీయ అవసరాలు తీర్చే పూజారి వర్గం కొనసాగుతూనే వచ్చింది. మాదిగదాసు ఉపకులం వాళ్లు, చాతుర్వర్ణం వాళ్ళకు, సవర్ణులకు అస్పృశ్యులే! మాదిగలకు వీళ్ళు గౌరవనీయులుగా మారారు.

కారణం? నియమనిష్ఠలవల్ల, పూజాపునస్కారాలు వల్ల, శుభాశుభ కార్యాలు నిర్వహించటం వల్ల, శుచీశుభ్రత పట్టుదలగా కాపాడుతూ రావటం వల్ల, అన్నింటికంటే ముఖ్యం మాదిగల ప్రాచీన వైభవం వివరిస్తూ, వంశవృక్షాలు తెలుపుతూ, వంశంలో సత్పురుషుల్ని స్తుతిస్తూ, వీరుల్ని పొగుడుతూ, దానకర్ణుల్ని ఆరాధిస్తూ, అందరినీ ఆశీర్వదిస్తూ ఉండటం వల్ల వాళ్ళ మాటకు విలువ ఉంది.

బ్రాహ్మణులు శూద్రులతో ఎలా ప్రవర్తిస్తారో, వీళ్ళు మాదిగలతో అలా ప్రవర్తిస్తారు. మాదిగల దగ్గర భిక్ష పుచ్చుకొంటారు. కాని అన్నం పెట్టించుకోరు. తినరు. మాదిగలను దగ్గరకు రానీరు, తాకనీరు. వీళ్ళు తాకరు. బ్రాహ్మణులు వీళ్ళను తాకరో, వీళ్ళు బ్రాహ్మణుల్ని

తాకరో, తెలియదు కానీ వీళ్ళు బ్రాహ్మణులకు దూరంగా ఉంటారు. బ్రాహ్మణుడు నడిచే తోవలో వీళ్ళు నడవరు. వీళ్ళు బ్రాహ్మణ వీధికి పోరు. మాదిగలతో పని ఉంటే బ్రాహ్మణులు మాదిగపల్లె పొలమేరలో నిలచి, కావలసిన మనిషికి కబురు పెట్టినట్లు కూడా బ్రాహ్మణ వీధికి పోయి అవసరమైన వాళ్ళను పిలిచే పని వీళ్ళు చేయరు. 'వాళ్ళతో మాకేంపని?' అంటారు.

మాదిగ దాసులకు వేరేవృత్తి ఏదీ ఉండదు. మాదిగల గత వైభవం, వంశచరిత్రలు చెప్పటమే! అది స్తుతి లాగా ఉంటుంది కాబట్టి కల్పన కూడా ఉంటుందని ఎవరైనా విమర్శగా వింటే అనిపించవచ్చు. వీళ్ళు ఎక్కువ మందిలేరు. క్రమక్రమంగా తగ్గుతున్నారు. పూర్వంలాగా భిక్ష దొరక్క పోవటం కావచ్చు. మారిన పరిస్థితుల్లో భిక్షాటనం నామర్దాగా మారటం కావచ్చు. ఆంగ్లేయుల రాకతో ఇంగ్లీషు చదువు అందరికీ అందుబాటులోకి రావటంవల్ల వీళ్ళ పిల్లలూ చదువు కోవటం కావచ్చు. ఏది ఏమైనా మాదిగదాసులు మాదిగ పల్లెల్లోకి అరుదుగా వస్తున్నారు.

శంభుదాసుది నిండైన విగ్రహం. శిల్పులు చెక్కిన నల్లరాతి బొమ్మలాగా ఉన్నారు. నుదుటి విభూది, మెళ్ళో లింగకాయలు, బుజ్జోణ్ణి ఆకర్షించాయి. చొక్కాలేని శరీరం నిగనిగలాడుతూ ఉంది. మెడనిండా రుద్రాక్షల మాల, రంగురాళ్ళ మాల, పంచలోహాల పేనిన తాడంత మందమైన గొలుసు, చుట్ట చుట్టినట్లున్న సప్తవర్ణాల దారాల వెంట్రుకలు పేనిన దండ, ఉన్నాయి. తలచుట్టూ ముచ్చికల గుంట మీద ముడికట్టి వదిలేయబడింది. జుత్తు గొడుగులాగా విచ్చుకొంది. నుదుటికి, చేతి పిక్కలకు, చేతులమీద విభూది దట్టంగా ఉంది. రెండుచేతులకు బిర్రుగా దండ కడియాలున్నాయి. చేతుల వేళ్ళన్నింటికి, ఇత్తడి, రాగి, వెండి, కంచు, బంగారం ఉంగరాలున్నాయి. కాళ్ళకు కంటెలు, కడియాలు ఉన్నాయి.

శంభుదాసుతో పాటు సేవకుడు ఉన్నాడు. అతడూ మాదిగ ఉపకులం వ్యక్తే. దక్కలికులం. వీళ్ళద్దరినీ కాపాడుతూ ఒక కుక్క వచ్చింది. అది చాలా ఆరోగ్యంగా ఉంది. సేవకుడి చేతిలో సంచి, నెత్తినమూట ఉన్నాయి. అందులో తాళపత్రగ్రంధాలు ఉన్నాయంటారు. ఎప్పుడయినా అవసరమయితే వంశవృక్షాలు గుర్తుతెచ్చుకోవటానికి ఆ తాళపత్రగ్రంథాలు నెత్తిమూటనుంచి వెలుపలికి తీస్తాడు శంభుదాసు. సేవకుడి చేతిసంచిలో శంభుదాసుకు కావలసిన తుండుగుడ్డ, పంచ, విభూది కాయలు వంటి వస్తుసామగ్రి ఉంది. అతడి ఎర్రంచు పట్టుపంచ వేసవి ఉదయపు ఎండకు మెరుస్తూ ఉంది. కుక్క మెడలో గంటల పట్టెడు ఉంది. కాళ్ళకు గజ్జెలున్నాయి. శంభుదాసు వస్తుంటే గంటలమోతా, గజ్జెలచప్పుడూ వినబడుతూ ఉంటుంది.

శంభుదాసును చూస్తున్న బుజ్జోడికి చాలా విచిత్రంగా ఉంది. శంభుదాసును ఇంతకుముందు తాను చూచినట్లు లేదు. అమ్మానాన్నా చూచినట్లున్నారు. అతడు రాగానే పార్వతమ్మ మంచం వాల్చింది. దుప్పటి పరిచింది. సేవకుడు పీటమీద కూర్చున్నాడు. కుక్క దాసుకాళ్ళ కాడ చేరింది.

దాసు బుజ్జోణ్ణి పిలిచాడు. ఎదురుగా నేలమీద కూర్చోమన్నాడు. బుజ్జోడు కూర్చోలేదు పార్వతమ్మ చేతులు కట్టుకొని నిలబడింది. పసివాణ్ణి చూస్తుంటే 'నేనిక్కడే కూసుంటా' అన్నాడు బుజ్జోడు. వాడు ఎదురుగా ఉన్న నులకమంచం మీద కాళ్ళు ఊపుతూ కూర్చున్నాడు.

దాసు మాదిగల చరిత్ర చెప్పసాగాడు. బుజ్జోడు ఆసక్తిగా వింటున్నాడు. వీళ్ళ వంశంలో పూర్వీకుల గొప్పతనం తెలిపాడు. మధ్యలో 'మీతాతముత్తాతలు' అన్నాడు. ఇంకా ఉత్సాహంగా వింటున్నాడు పిల్లవాడు. వాళ్ళెంత గొప్ప పనులో చేశారన్నాడు. సైనికాధికారులుగా ఎన్ని యుద్ధాలు చేశారో, ఎవరెవరు ఏయే యుద్ధం ఎలా ఎలా చేశారో, ఏఏ ప్రాంతాలు గెలిచారో, ఏ పరాక్రమం, ప్రతాపం, శౌర్యం, సాహసం ప్రదర్శించారో చెప్పాడు. బుజ్జోడి ముత్తాత వాసిరెడ్డి వెంకటాద్రినాయుణ్ణి ఎలా కాపాడిందీ చెప్పాడు. వేదశాస్త్రపురాణాలు ఎలా చదివిందీ చెప్పాడు. బుజ్జోడికి అనుమానం వచ్చింది. వస్తే లేచినిలబడి వాళ్ళ మాష్టార్ని అడిగి సందేహం నివృత్తి చేసుకొంటాడు. అలాగే లేచినిలబడి చేతులు కట్టుకొని 'మాదిగోల్లని యాదాలు సదవనీయరంటగా' అన్నాడు. శంభుదాసు సంతోషంగా నవ్వాడు.

నిజమే చదవనీయరన్నాడు. విననీయరన్నాడు. వింటే చెవుల్లో సీసం కరిగించి పోస్తారన్నాడు.

శంభుదాసు అతణ్ణి ఉత్సాహపరిచాడు. 'అడుగు!'

'సీసం కరిగిచ్చి పోత్తే మనిసి సావడా?'

'చస్తాడు!'

'సంపొచ్చుగా, సీసం కరిగిచ్చి పొయ్యటంవెందుకు!'

'వినరాని వేదం, విన్నవి చెవులు, వాటికే శిక్ష'.

'నేరంవొకటి, సిచ్చ ఒకటి, సావు ఇంకొకటి!'

'ముడ్డిమీద తంతే, మూతి పళ్ళు రాలినట్లు ఒక అవయవం అపరాధం చేస్తే శరీరమంతా శిక్ష అనుభవిస్తూంది.'

'అమ్మదెచ్చిన బెల్లం, అడక్కుండా తిన్నందుకు నడీపు పెడీలున బగిలినట్లు!' అన్నాడు బుజ్జోడు.

'మాబాగా జెప్పేవు, వేదాలు వల్లిస్తే నాలిక గోసేవాళ్ళు.'

'ఎవుళ్ళు సెప్పరు గందా, యట్టా వొల్లిచ్చేవోళ్ళు?'

గురుకులంలో గురువు శిష్యులకు వేదం వల్లింప జేసినప్పుడు చాటునుంచి విని మాదిగ మారాజు వల్లిస్తే-

'మరి మాపెద్దోళ్ళు - ఆ పుస్తకాలన్నీ యట్టా జదివేరు!'

'నువ్విప్పుడెన్నో తరగతి?'

'అయిదుకు బోతన్నా!'

'నువ్వు పుస్తకాలు చదువుతున్నావా?'

'ఓఁ!'

'నువ్వు వేదాలు చదవవచ్చు!'

'నేను జదవను!'

'ఏం?'

'ఆళ్ళొద్దన్నాటిని సదివేకర్మ నాకేం బట్టింది?'

'నువ్వాళ్ళంతటోడివి కావాలంటే చదవాలి!'

'అట్టాగా?'

'ఆ పట్టుదలతో తురకలు దేశాన్ని పాలిస్తున్నప్పుడు మాదిగలు రహస్యంగా వేదశాస్త్రపురాణాలు చదవసాగారు. ఇంగ్లీషు వాళ్ళు వచ్చాక బాహాటంగా చదువుకొన్నారు. ఇప్పుడు దేశ స్వాతంత్ర్యం వచ్చింది కాబట్టి ఎవరైనా ఏదైనా చదవవచ్చు!

'అయితే చదువుతా?'

'మీ ముమ్ముత్తాతలు, ముత్తాతలు, కత్తీ పట్టారు. కలమూ, పట్టారు'

'నేను బడతా!'

'వాళ్ళు యుద్ధాలు చేశారు, గెలిచారు!'

'నేను గెలుత్తా!'

'వాళ్ళు పుస్తకాలు చదివారు, పుస్తకాలు వ్రాశారు'

'నేనూ రాత్తా!'

'వాళ్ళు సభలు సమావేశాలలో పాల్గొని శత్రువుల్ని, వాదించి, గెలిచారు'

'నేనూ గెలుత్తా!'

'మీ తాత, తండ్రి కూలీనాలీ చేసి పొట్టపోసుకొంటున్నారు'

'నేనూ–' బుజ్జోడు ఆగిపోయాడు.

'ఏం ఆగావు?'

'నేను మాముత్తాత, ముమ్ముత్తాతల లాగా బతుకుతా?'

'వాళ్ళు ఆకలిని జయించారు!'

'నేనూ జయిత్తా!'

'విద్యార్జనంలో, యుద్ధ నైపుణ్య సంపాదనలో వాళ్ళు ఆకలి జయించి, తపస్సు లాగా సామర్థ్యాలు సంపాదించారు'

'నేనూ సంపాదిత్తా!'

'నీకు శుభం' అన్నాడు దాసు.

బుజ్జోడు మౌనంగా కూర్చున్నాడు.

శంభుదాసు వంశవృక్షాలు, ఆ ఇంటివాళ్ళ వంశపురుషుల ఘనకార్యాలు చెబుతున్నప్పుడు పల్లెమాదిగలు దాసు చుట్టూ మూగారు. మేం ఒకనాడు రాజులం అనుకొన్నారు. ఒకప్పుడు బాగా బతికాం అనీ తలపోశారు. ఒకప్పుడు రాజమందిరాల్లో నివసించాం గానీ, ఇప్పుడు గుడిసెలు కూడా లేవు. ఒకప్పుడు పంచభక్ష్య పరమాన్నాలు తిన్నాం కానీ ఇప్పుడు మింగ మెతుకులేదు, ఒకప్పుడు చీనిచీనాంబరాలు ధరించాం కానీ, ఇప్పుడు చిరుగు పాతలు కడుతున్నాం. ఏమీ చింతపడకుండా, ఒకనాటి వైభవం తలుచుకొని మాదిగలు ఆనందపడసాగారు.

చెప్పటం ముగించి, 'పార్వతమ్మా! ఈ పూట నీయింట ఆహారదీక్ష' అన్నాడు శంభుదాసు.

పార్వతమ్మ భయపడినంత అయింది. భర్తరాలేదు. ఇంట్లో గింజలు లేవు. దాసుకు భోజనం ఏర్పాట్లు జరగాలి.

'అమ్మాయి!' పిలిచాడు, పార్వతమ్మ దాసును చూచింది.

'ఉప్పుతో ముప్పయి మూడు ఉండాలి తల్లి'

పార్వతమ్మ గుండెలు మళ్ళీ పగిలాయి.

శంభుదాసు చెప్పిన మాదిగల చరిత్ర విన్న వాళ్ళందరూ సిద్ధమయ్యారు. పార్వతమ్మ పల్లెమీద వేటకు బయలు దేరింది. ఎక్కడ ఏం దొరికితే అది తీసుకురాసాగింది.

'అయ్యవారికి చాలు అయిదు వరహాలు, పిల్లవాళ్ళకు చాలు పప్పు బెల్లాలు' అని పాడుతూ ఇంటింటా తిరుగుతూ, డబ్బు వసూలు చేసి బడిపంతులుకివ్వటం బుజ్జోడికి వింతగా ఉండడం మానేసింది. అంతకుముందు అయ్యవారు మాయింట్లో బియ్యంలేవు, కందిపప్పు లేదు, చింతపండు లేదు అని పిల్లలతో చెబితే తెల్లారి పొద్దున్నే బడికిపోతూ నిక్కరు జేబుల్లో, ఒకడు బియ్యం, ఒకడు కందిపప్పు, ఒకడు చింతపండు తెచ్చి అందరూ కుప్పపోస్తే అవన్నీ రాసిగా అయ్యేవి. అయ్యవారు ఎప్పుడూ ఉప్పు తెమ్మనేవాడుకాదు. శంభుదాసు ఉప్పుతో

ముప్పైమూడు కావాలంటున్నాడు. 'మీ ఉప్పుతింటున్నవాణ్ణి' అంటున్నాడు. ఈ ఉప్పు వ్యవహారం బుజ్జోడికి వింతగా ఉంది.

మాదిగల ఇళ్ళలో వండిన అన్నం తినడు. మాదిగలు తాకిన భోజనం నిషిద్ధం. తానే వండుకోవాలి. స్వయంపాకం, వంటసామగ్రి వాళ్ళు ఇవ్వాలి. పాత్రలు వాళ్ళివ్వాలి. వాటిని సేవకుడు శుభ్రం చేసి ఇస్తాడు. సహాయం చేస్తాడు. అందిస్తాడు. వంట దాసే చేసుకొంటాడు. వాళ్ళిచ్చిన వస్తువులు సరిపోతే సంతోషం. సరిపోకపోతే, చెప్పకుండా వెళ్ళిపోతాడు. అది అపశకునం. సరిపోతే సంతోషంగా నవ్వుతాడు. అదే శుభం. మిగిలితే ఆశీర్వదిస్తాడు అదే పుణ్యం.

పార్వతమ్మ దాసుకోరిన వస్తువులు ఇంటింటికీ తిరిగి సంపాదించి తెచ్చి పెట్టింది.

1. ఉప్పు మట్టి సట్టిలో పెట్టింది.
2. బియ్యం సంచిలో పోసి తెచ్చింది.
3. కందిపప్పు గుట్టగా గుడ్డమీద ఉంచింది.
4. కాగితం మీద చింతపండు
5. మూకుట్లో మిరపకాయలు ఎండువి.
6. గిన్నెలో పచ్చిమిరపకాయలు
7. కాగితం పొట్లంలో మిరియాలు, పసుపు కారం.
8. గ్లాసులో మంచినూనె

టిక్కి జనపనార సంచిమీద

9. సెనగలు
10. పెసలు
11. వేరుసెనక్కాయలు
12. మినుములు
13. ఉల్లిపాయలు
14. వెల్లుల్లిపాయలు

దినపత్రిక మీద

15. ఆవాలు
16. గసగసాలు
17. దాల్చిన చెక్క

18. లవంగాలు

19. యాలుకలు

గుడ్డ సంచిమీద

20. బంగాళాదుంపలు

21. చిలగడ దుంపలు

22. ఎండుకొబ్బరి

23. ములక్కాయలు

24. రామ్ములక్కాయలు

25. దోసకాయలు

26. బెండకాయలు

27. దొండకాయలు

మూకుట్లో

28. పొదినాకు

29. కొత్తిమీర

30. కరివేపాకు

పార్వతమ్మ దాసు దగ్గర అవన్నీపెట్టి, పాత్రలిచ్చింది. వాటిని చూపించింది.

'సంతోషం' అన్నాడు.

సేవకుడు పాత్రలు కడిగి తెచ్చాడు. బావినుంచి నీళ్ళుతోడి తెచ్చుకొన్నాడు. కత్తిపీట, చాకు, తుడిచి కడిగిపెట్టాడు.

దాసు స్వయంపాకానికి సిద్ధమయ్యాడు.

పొయ్యి ముట్టించుకొన్నాడు 'శివార్పణం' అన్నాడు.

బుజ్జోడు పార్వతమ్మ చెంగుపట్టుకొని గుంజాడు. 'ఏమిట్రా' అంది తల్లి. చెవిలో ఏదో గుసగుసలాడుతున్నాడు. 'చెప్పు'! అంది వినబడక.

'ఉప్పుతో ముప్పై మూడంటే, ఉప్పుతో కలిపి ముప్పైమూడా? ఉప్పుకాక ముప్పైమూడా?' అని అడిగాడు.

'ఉప్పుతో కలిపి ముప్పై మూడు!' అంది తల్లి.

'మరి నువ్వు ముప్పయి మాత్రమే ఇచ్చేవు. మాట తప్పేవు. కీడు మూడుతుంది!'

'పొయ్యి, పొంత, పొయికట్టెలు- మూడు' అంది.

'కుండలు, నిప్పు?'

'నువ్వు రెండాకులు ఎక్కువే సదివేవు!'

'మరి దాసుకోరిన ముప్పై మూడు, నువ్వు ఇచ్చిన ముప్పై మూడు - ఒకటేనా?'

'కాకపోవచ్చు!'

'దాసు కోరిందొకటి, నువ్విచ్చిందొకటి అయితే తప్పుకదా!'

'కాదు!'

'యెట్టా?'

'ఉప్పు తప్పనిసరిగా ఉంటూ, మనం మిగతా వంట సరుకులు ఏవైనా ఇవ్వవచ్చు!'

బుజ్జోడు అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

'దాసుకు ఇష్టమయినవి ఇవ్వాలా? నీకిష్టమైనవి ఇవ్వాలా?'

'మనకున్నవి ఇవ్వాలి. లేకపోతే ఊరంతా తిరగి అడిగి పోగుచేసి తెచ్చినవి ఇవ్వాలి.

'మరి మనింటో ఎండొరికీళ్ళుండాయ గందా, ఎందుకీయలా?'

'దాసు మాంసాహారం తినడు'

'ఎందుకు తినడు?'

'దాసు శాకాహారి!'

'అంటే బేపనోళ్ళలాగా!'

'ఆఁ! నేను బేపనోళ్ళకంటే గొప్పవాణ్ణి అని దాసు అనుకొంటాడు.'

'నిజంగా గొప్పవాడయితే అడుక్కోవటం ఏమిటి?'

'గొప్పవాళ్ళు అడుక్కుతింటారు, మనదేవుడు లాగా, శివుడు పెద్ద బిచ్చగాడు!'

'ఏం పనీ సేయనోళ్ళు గొప్పోళ్ళా! పని సేసేవోళ్ళు గొప్పోళ్ళుకారా? రోడ్డేసే మ్యానాయన గొప్పోడు కాదా? మాటలు సెప్పి బతికే దాసు గొప్పోడా?'

'గొప్పోళ్ళని మనం పెట్టి పోసిచ్చాలి'

'ఎవురే అమ్మ గొప్పొళ్ళు?'

'నువ్వే సెప్పాలి కొడుకా? నువ్వు గొప్పోడి వయ్యి మాకు సెప్పాలి'

'అడుక్కు తినేవాణ్ణయి-'

'కాదు , పెట్టిచ్చుకుతినేవోడివయి-'

'నాకు తెలియలా!'

'తెలుసుద్దిలే!'

* * *

రామానుగ్రహ శాస్త్రి షష్టిపూర్తి అయ్యాక అతడి పితృదేవుడు పూర్ణాయుష్కుడుగా, శతవృద్ధుడుగా పరమపదించాడు. శాస్త్రి, ఒక భార్య మూడునెలలు, మరోభార్య రెండురోజులు సంసారం చేసి, తనువు చాలించి ఒకరు, దాంపత్య జీవితం చాలించి ఒకరు దూరంకాగా ఇరవైఏళ్ళ వయస్సులోనే వైరాగ్యం వచ్చి, సంసార లంపటం త్యజించి, అకుంఠిత దీక్షతో పితృసేవాతత్పరుడై జీవించాడు. శాస్త్రి దైవభక్తిని పితృసేవను మేనోళ్ళకొనియాడే గ్రామప్రజలు శాస్త్రి అమాయకుడని, భార్య అవసరంలేని ఆబోజుకుడని అవమానకంగా మాట్లాడేవాళ్ళు. ఇల్లు, గుడితప్ప మరో సంగతి పట్టని సద్బ్రాహ్మణుడు శాస్త్రి. పూజ, వంట, పితృసేవ, నిద్ర తప్పమరోపనిలేని అతడికి తండ్రి మరణంతో తీరని లోటు వచ్చింది. ఇంట్లో తోడు ఎవరూ లేరు. అది పెద్దలోటే. ఆలోటును శాస్త్రి వృద్ధాప్యం పూరించింది. తండ్రి సేవాసమయాన్ని తన వృద్ధాప్యపు అశక్తతకు అనుసంధానం కావించాడు. కాకపోతే మిగతా పనులు షరా మామూలుగా సాగిపోతున్నాయి.

గుడికి నిత్యనైమిత్తిక కర్మకాండ యధావిధిగా ఏదోవిధంగా కొనసాగుతూనే ఉండాలి. ముత్తాతల నాటి ఇల్లు. రాతి గోడలే! పెంకుటిల్లు! రెండు తుఫానులు తట్టుకొంది. గోడలు తట్టుకొన్నా, పెంకులు నిలబడలేకపోయాయి. ఇల్లు రిపేరు కొచ్చింది. అందరూ హెచ్చరించారు. దాన్ని బాగు చేయించమని. లంకంత ఇల్లు! తనకెందుకు అంత ఇల్లు? తనేం చేసుకోగలడు? పడకకోగది, వంటకోగది చాలు. నిజానికి మిగతా గదులు అనవసరమే! అయితే తాత ముత్తాతల జ్ఞాపకాలు ఆ ఇంటి అస్తిత్వం మీద ఆధారపడి ఉన్నాయి. ఏం మార్పులు చేసినా ఆ జ్ఞాపకాల గుర్తులు మాసిపోతాయి. అందువల్ల ఆ ఇంటి మరామ్మత్తు పనులేమీ పట్టించుకోలేదు.

తాము ఇంటినిండా బిలబిలలాడుతున్నప్పుడా యిల్లు నిజంగా మహారాజ సౌధమే! అప్పుడది కళకళ లాడిన వైనం అందరికీ ఎరుకే! ఇప్పుడా యిల్లంతా బోసి పోయినట్లుంది. ఇంటి గోడలమీద పాచిపట్టి గడ్డి మొలిచి దిక్కులు చూస్తూ ఉంది. గోడలపైన రావి, మర్రిమొక్కలు పుట్టి గోడబారునా వేళ్ళూని స్థిరపడుతున్నాయి.

ఇంటి పెంకు లెగిరిపోయి, గదుల్లో ఎండపడి, వానపడి గదులు శిధిలమవుతున్నాయి. ఇంటిగోడల గార ఊడిపోయింది. లోపల గచ్చు పెచ్చులు లేచిపోయింది. ఆయింటిలో శాస్త్రి ఒక్కడే చరాస్తి. స్థిరాస్థి శిధిలక్షేత్రంలా ఉంది. అరవై ఏళ్ళకే శాస్త్రికి నడుం వంగటం లేదు. అయినా పూజాదికాలు నిర్విఘ్నంగా నెరవేరుస్తూనే ఉన్నాడు.

ఊరివాళ్ళకు దేవుడు, దేవాలయం, పూజలు అక్కరలేకుండా పోయాయి, పూర్వం వేజండ్ల గరువున వేరు సెనగ, కంది, కూరగాయలు విశేషంగా పండేవి పంటలు. రేగడి

పోగాకు, పత్తి, ధనియాలు, మిరప విలువైన పంటలు పండేవి. నడివేసవిలో గరువంతా దోస, రాంములగ అలివి కాకుండా పండేవి. గరువునేల చిక్కుడు కాయకు పెట్టిందిపేరు. కాకర, బీర, సొర, పిచ్చిగా పండేవి. పొట్లకాయలు మనిషంత పొడుగు చేయంతలావు వెన్నలాంటి రుచిగా ఉండేవి. గుంటూరు గోంగూర అని ప్రసిద్ధి పొందిన గోగాకు వేజండ్లదే రుచి, మెట్టగోంగూర అయితేనే గొప్ప. ఆకు కూరలు ముఖ్యంగా పెరుగుతోట కూర మనిషెంతు పెరిగేది. అన్ని పంటలు బాగా ఉండేవి. రైతులు సుఖశాంతులతో ఉండేవాళ్లు.

రాగి, సజ్జ, జొన్న, కొర్ర పంటల్ని మించి, బుడమొద్లు, పండించేవాళ్ళు రైతులు. బుడమొద్లు మెట్టపంట, వరిపంట. ఎర్రబియ్యం, బువ్వ ఎర్రగా ఉండేది. పొద్దుట తింటే రాత్రిదాకా ఆకలి ఉండదు. డబ్బు పంటలు వచ్చాక, తిండిగింజలు పండించటం మానేశారు రైతులు. పొగాకు పంట పెద్ద జూదం. ఆకురంగు వచ్చిందా ఆ రైతు కుబేరుడు. రాలేదా కూటికి లేనిరైతే! వేజండ్ల రేగడి పొగాకు గ్రేడింగులో మొదట నిలిచేది. రైతులు బాగుపడ్డారు.

పత్తిపంట బాగా మొదటి అయిదారు సంవత్సరాలు ఊరించింది. ఆ తర్వాత పురుగుపడి చెడిపోయింది. బాగుపడ్డ రైతులు మిద్దెలు మేడలుగా, మేడలు భవంతులుగా పెరిగిపోయారు. పంట దెబ్బతినటం గుర్తించి మానుకొన్న వాళ్ళు అదృష్టవంతులు. ఆఏడు మరుసటి ఏడు అంటూ ప్రయత్నిస్తూ పోయినవాళ్లు బాగా మునిగిపోయారు.

పూర్వం వర్షాలు బాగా పడేవి. పంటలు బాగా పండేవి. నీళ్ళు చెరువులో, కుంటల్లో ఏడాది పొడుగునా ఉండేవి. బావుల్లో నీళ్ళు కొదవలేకుండా ఉండేది. అట్లాంటిది బావులు ఎండిపోసాగాయి. ఎంతలోతు తవ్వినా బావుల్లో నీళ్ళు పడటంలేదు. ఎండాకాలం మెట్ట పంటలు తగ్గిపోయాయి. ఆకుకూరలు, కూరగాయల పండటం వెనకయింది. పత్తి దెబ్బతింది. పొగాకు రంగు తగ్గి, కట్టుకున్న బేరన్లు పసువుల కొట్టాలు చేసుకోవలసివచ్చింది. అటు గరువు పంటలు, ఇటు రేగడి పంటలు పూర్వంలాగా లేక, రాక, రైతులు బ్రతుకుదెరువుకు కష్టపడుతూ వచ్చారు.

శాస్త్రి బాల్యంలో బాగా ఉన్న వేజండ్ల తాను పెరుగుతున్న కొద్దీ అదీ పెరిగిందికాని రైతుల బతుకు భారంగా మారసాగింది. తన యాభయి అయిదో ఏట నాగార్జునసాగర్ నీళ్ళు వేజండ్ల పొలాలకు అందసాగాయి. లేకపోతే రైతులు ఎట్లా బ్రతికేవాళ్ళో ఊహించటం కూడా కష్టంగా ఉంటుంది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. వస్తూ ఎన్నికలు తెచ్చింది. ఎన్నికలు ప్రజలకు ఓట్లు ఇచ్చాయి. ఓట్లకోసం పోటీలు వచ్చాయి. ఎవరో గెలుస్తారు, ఎవరో ఓడిపోతారు. నిరంతరం గెలుపు ఓటముల ప్రభావం గ్రామాన్ని వెంటాడుతూనే ఉంది. ఎన్నికలు డబ్బుతో ముడిపడ్డాయి.

తనకు నలభైఏళ్ళ వచ్చిందాకా కమ్యూనిస్టులన్న మాట తాను వినలేదు. కమ్యూనిస్టులు దేశాన్ని తగలబెడతారని జనం చెప్పుకొనేవాళ్ళు. స్వాతంత్ర్యం వచ్చి ప్రభుత్వం వాళ్ళను వెంటాడుతుందని, వేటాడుతుందని విని తాను కుంగిపోయాడు. మనిషిని మనిషి చంపటం

తనకెందుకో బాధగా ఉండేది. రాజకీయ పార్టీలు మతాలను, కులాలను బయటికి లాక్కువచ్చాయి. వేజండ్లలో పేదలంతా కమ్యూనిస్టులని, రైతులంతా కాంగ్రెసనీ అనుకోసాగారు. రైతుల్లో కమ్మారెడ్డి పోటీపడుతూ ఉండేవాళ్ళు.

నాగార్జునసాగర్ నీళ్ళు గరువుకు రాలేదు. రేగడి నేల కూడా పూర్తిగా సాగుబడిలోకి రాలేదు. ఆ మాత్రం సాగుబడి వల్ల రైతు చావకుండా బతకగలిగే పరిస్థితి వచ్చింది. సుఖంగా బ్రతికే రైతులు డబ్బు పంటలతో మరీ సుఖసంతోషాలు పొంది అని పాడయి పోగా మామూలు పరిస్థితుల్లో కూడా ఉండలేకపోయారు. రైతులు బాగాలేరు. పైగా కులం మతం కాంగ్రెసు, కమ్యూనిస్టు రాజకీయాలతో ముఠాలుగా, కొత్తముఠాలుగా విడిపోయారు జనం. చాతుర్వర్ణ్యం పంచములుగా ఐదు గుంపులుగా చీలికలు పీలికలు అయిన గ్రామ జనం కొత్త ముఠాలుగా మరీ ఒకరికొకరు దూరమయ్యారు.

రైతులు బాగుంటే గుడి బాగుంటుంది. గుడి బాగుంటే పూజారి బాగుంటాడు. పూజారి బాగుంటే దేవుడు కళకళలాడుతుంటాడు. పూజాపునస్కారాలు తగ్గి వేణుగోపాలస్వామి వెలాతెలా పోతున్నాడు. గుడి గోపురాలకు సున్నం కొట్టించే నాథుడు లేకపోయాడు.

కరువులో అధికమాసంలాగా కమ్యూనిస్టు లనబడేవాళ్ళు దేవుణ్ణి పూజించరనీ, స్వామి అస్తిత్వమే శంకిస్తారని, దేవుడంటే చులకన భావమని విని శాస్త్రి చింతాక్రాంతుడయ్యాడు. దానికి తోడు మాలమాదిగల్ని గుడికి రానీరు. ఒకవేళ తాను రానిస్తే తన తాటవలుస్తారు. కొందరిట్లా గుడికి దూరంగా, కొందరు పేదరికం ఇనపసంకెళ్ళు పడి కాళ్ళూచేతులు ఆడక బిక్కచచ్చిపోయారు.

గుడి పూజలు తగ్గాయి. తీర్థప్రసాదాలు లేవు. దీపారాధన ఉంది, మినుకుమినుకు మంటూ. ఆధ్యాత్మిక చింతనలేదు. భజనలు లేవు. భక్తిగీతాలు లేవు. హరికథలు లేవు. భక్తుల రాకపోకలు అంతంత మాత్రం.

సంక్రాంతినాడు పంట ఇంటికి వచ్చి రైతు చేసే పండగ ఆచూకీ లేకుండా పోయింది చలిమంటలు లేవు. గంగిరెద్దుల్లేవు. హరిల్లో రంగ హరీలు లేవు. గొబ్బెమ్మలు లేవు. హరిదాసులు లేరు. పంగనామాలు లేవు. పట్టు బట్టల్లేవు. పాత బట్టలడిగే దాసర్లు లేరు. పాడిందే పాడే పాచి పళ్ళ దాసరీలేదు.

పొలం నుంచి ధాన్యం తెస్తూ పూజారిని పిలిచి గుడిముందు ధాన్యం బస్తా దించి పోయే రైతు కనిపించటం లేదు. ఇంటికిపోయి, అడిగినా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. 'నువ్వు ఒంటిగాడివి నీకెందుకీ బాదరబందీ?' అన సాగారు జనం. శాస్త్రికి ఆకలి అవుతుందని ఎవరూ గుర్తించటం లేదు. మునసబుతో శాస్త్రి పరిస్థితి వివరించాడు. అతడు తన నిస్సహాయత చూపి చేతులెత్తేశాడు. కరణంతో చెబితే విచిత్రంగా నవ్వాడు నియోగి అయిన కరణం. వైదికి అయిన పూజారిని కరణం చిన్నచూపు చూడటం తన తండ్రి కాలంలోనే ఆరంభమయింది.

నిత్య నైమిత్తిక కర్మకాండకు, ధూపదీపనైవేద్యాదులకు గుడికట్టించిన రోజుల్లోనే గుడిమాన్యం, గోంగూర మాన్యం, చింతతోపు, తాటితోపు ఏర్పాటు చేశారు భక్తజనులు. మొదట్లో గుడిమాన్యం సాగుచేసుకొన్న రైతులు ధాన్యం గింజలు అడక్కుండా ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు అడిగినా ఇవ్వటం లేదు. చింతతోపు రాబడి ఆరోజుల్లోనే పాతిక వరాలుండేది. ఇప్పుడు ఎర్ర ఏగాణీ రావటం లేదు. తాటితోపు కల్పవృక్షాల తోపు. ఎంతో ఆదాయం ఉండేది. కల్లుగీత నిషేధంతో కుంగిపోయిన గవళ్ళోళ్ళతో పాటు శాస్త్రి కూడా నీరసించి పోయాడు. మాన్యాల మీద కానీ, తోపుల మీదకానీ, రావలసిన రాబడి లేక గుడి కళాకాంతులు కోల్పోయింది.

స్వాతంత్ర్యంతో పాటు దేశానికి వచ్చిన కరువు వేజండ్లను కూడా పీడించింది. ఆరేడేళ్ళకు కరువు తగ్గింది. కానీ, అప్పుడు వచ్చిన కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం తగ్గలేదు. పైగా పెరగసాగింది. దాంతో గుడిమీద గురితగ్గింది. దేవుడిమీద భక్తి తగ్గింది. దున్నేవాడిదే భూమి అయింది. గుడి మడి మాన్యాలు సాగు చేసుకొంటున్న వాళ్ళు భూమిని సొంతం చేసుకొన్నారు. పేరుకే గుడి ఆస్తులు, అనుభవం రైతుల స్వాధీనం. ఏతావాతా గుడికి రాబడి లేదు. పూజారికి అందుబడిలేదు. రైతులకు భక్తి శ్రద్ధలు తగ్గాయి. అమావాస్యకో, పున్నానికో దేవుడు గుర్తుకు వస్తున్నాడు.

పూజారికి నెలజీతం లేదు. శాస్త్రి బ్రతుకుదెరువు రైతు లిచ్చే మాన్యం ధాన్యమే. అది లుప్తమయినప్పుడు యాచించలేని పూజారి పేదగా కడుపేదగా మారిపోయాడు. వంశపారంపర్యంగా నమ్ముకొన్న గుడిని వదులుకోలేక, వదిలి జీవించలేక, తరతరాలుగా జీవించిన ఇంటిని అమ్మలేకా, బాగు చేయించలేక, ఇంతకాలం బతికించిన ఊరును వదలలేక, వదిలి ఎక్కడికీ పోలేక, అసహాయంగా, నిస్సహాయంగా, పురావైభవాల నీడగా శాస్త్రి మిగిలిపోయాడు.

ఇంట్లో గింజలు లేవు. నిన్న తాను వంటచేసుకోలేదు. నీళ్ళు తాగి పడుకొన్నాడు. పేరమ్మ కోట్లో ఏమడిగినా అప్పుపుడుతుంది. పాతిక సెంట్లు ఇళ్ళస్థలం, పడిపోతున్నదే అయినా మిక్కిలి విలువైన కలప ఉన్న పెంకుటింటి మీద ఆమె చూపుంది. శాస్త్రి ఇప్పటికే చాలా అప్పుచేశాడు. ఇంకా అడిగితే అప్పు ఇస్తుంది. అప్పుపెరిగి, వడ్డీ పెరిగి చాలా మొత్తమయి ఇల్లు ఆమె సొంతమై, తాను వీధిన పడవలసి వస్తుందేమోనని చింత. తానాయింట్లోనే కాలం చేయాలని కోరిక. ఆపైన ఆమె ఆ యిల్లు సొంతం చేసుకొన్నా దిగుల్లేదు. అందువల్ల ఎక్కువగా అప్పులు చేయకుండా చేసిన అప్పు సర్ది వాడుకొంటూ బతుకీడుస్తున్నాడు. భోజనం బదులు కొబ్బరిచిప్పలు వొలుచుకొని తిని, నీళ్ళుతాగి పడుకొంటున్నాడు కానీ నిద్ర పట్టడం లేదు. అద్భుతమైన ఆకలి ఉండే తన ఉదరాన్ని ఇంతగా శిక్షించటం న్యాయమని తనకు అనిపించటంలేదు.

తిండీతీర్థం సరిగా ఉంటే తన తండ్రి చనిపోయేవాడు కాదు. తిండిపుష్టి వున్నమనిషి భోజనసదుపాయం లేక చనిపోయాడు. గుడి బాగుండి ఉంటే తండ్రి ఇంకా పదేళ్ళయినా బ్రతికేవాడేనని శాస్త్రి నమ్మకం. తండ్రి పాండిత్యం, వ్యక్తిత్వం భక్తతత్పరత మీద శాస్త్రికి ఎనలేని గౌరవం. ఉదయం లేచిన దగ్గరనుంచి ఆలోచిస్తున్నాడు శాస్త్రి. ఇవాళ శ్రాద్ధం, మొదటిసారి ఏమీ లోపం లేకుండా చేయాలి. శరభయ్యశాస్త్రి భోజన ప్రీతికి తగినంతగా శ్రాద్ధం పెట్టాలి.

తండ్రి, శ్రాద్ధ కర్మలకు కావలసిన సరుకుల చిట్టా రాసిస్తే, పేరమ్మ అన్నీ మూటకట్టి తెచ్చి ఇచ్చేస్థితి పోయింది. ఎవరినైనా పంపితే పంపే పరిస్థితి చేయిదాటి పోయింది. తానే పోతే సంతోషంగా ఇచ్చే స్థితీ లేదు. గొణుగుతూ ఇస్తుంది. 'ఎప్పుదు తీరుస్తారో ఏమో' అంటుంది. 'నేను బతికి ఉండగా మీఅప్పు వస్తుందో రాదో' అంటుంది. 'పాడుబడిపోయిన కొంప నాకెందుకు' అంటుంది. అయినా సరుకులు ఇస్తుంది.

అన్నీ వేణుగోపాలస్వామి చూచుకొంటాడని రామనుగ్రహశాస్త్రి చెప్పేవాడు. ఎప్పుడడిగినా ఏమడిగినా పేరమ్మ ఇస్తూ ఉంది. తండ్రికి కొడుకుగా తాను తన శ్రాద్ధకర్మలు సక్రమంగా చేయగలడు. సరుకులు తెచ్చాడు. దేవుడికి గతి ఏమి? దేవాలయం మూత బడుతుందా? తన యిల్లు పడిపోతుందా? పూజారి ఎవరు వస్తారు? పేరమ్మ ఇల్లు ఇలాగ్గే ఉంచుతుందా? పడగొడుతుందా? దిక్కుమాలిన ఆలోచనలతో తండ్రి దిక్కు చూశాడు రామానుగ్రహశాస్త్రి.

## 3

మాదిగ పల్లెకూ, అగ్రహారానికీ ఏం సంబంధం?

శంభుదాసు బుజ్జోడికి ప్రసాదించింది ఏమిటి? పరిగ్రహించింది ఏమిటి?

శరభయ్యశాస్త్రి రామానుగ్రహశాస్త్రికి అందించిన వారసత్వం ఏమిటి? పొందిన అనుగ్రహం ఏమిటి?

ఆహారదీక్షకు పూనుకొన్న శంభుదాసుకూ, నిరాహారదీక్ష విరమణకు సిద్ధమయిన రామానుగ్రహశాస్త్రికీ ఏం సంబంధం? వంట సరుకులు సమకూడటమే సంబంధమా?ఏం సంబంధం?

* * *

మాదిగ బసవయ్య ఇంటిలో, పార్వతమ్మ అందించిన వంట సరుకులతో, ఆ పూరింటిలో వాళ్ళ పొయ్యిలో, వాళ్ళ పాత్రల్లో, సేవకుడూ తానూ కలిసి శంభుదాసు వంట చేసుకొన్నాడు. పచ్చళ్ళు నూరుకొన్నారు. కూరలు వండుకొన్నారు. నేయీ, పెరుగూ తెప్పించుకొన్నారు. స్నానం చేసి, తెచ్చుకొన్న ఉతికిన బట్టలు కట్టుకొని, చాప వేసుకొని భోజనానికి శంభుదాసు ఉపక్రమించాడు.

బుజ్జోడు అడిగాడు తల్లిని 'నెయ్యేదది?'

'పేరమ్మ కొట్టులోది?'

'దానికి  అంటు లేదా' అంటే 'పేరమ్మ మాదిగ కాదు కదా' అంది.

'నాకనుఁవానమే' అన్నాడు.

'వెన్నకు అంటుంది. నేయికి లేదు. అగ్ని దాన్ని శుద్ధి చేసింది.'

'మరి పెరుక్కో?'

'పాలకు అంటుంది, పెరుక్కులేదు'

'ఎందువల్ల;'

'నేయి, పెరుగు ఆ రూపంలో  ఎవరిచేయీ పడదు  కాచిన నెయ్యి, తోడుకొన్న పెరుగు ఆ పాత్రల్లోనే ఇచ్చారు'

'పొయ్యి!'

'కొత్త అగ్గితో కాలింది.. అంటుమాయం'

'పాత్రలు!'

'కడిగి శుభ్రం చేత్తే పాత్రలకు అంటులేదు'

'శంభుదాసు యవ్వారం నాకు ఇద్దూరంగా ఉంది'

'యెవడు, యెప్పుడు అడుక్కుంటాడో, అప్పుడంతా ఇద్దూరంగానే ఉంటుంది'

'అడుక్కోటం రోత!'

'అంతకంటే దౌర్భాగ్యం లేదు. లోకంలో అందరి కంటే అడుక్కునే వాడు అధముడు!'

'ఆకలయితే?'

'పని చేయి! డబ్బుతే! వండిపెడితేతిను!'

'నాకు పని చేతకాదే!'

'ఇప్పటికి నీకోసం మీనాయన పనిసేత్తాడు!'

శంభుదాసు చేయి తిరిగిన ఆడవాళ్ళకంటే అద్భుతంగా వంట చేసుకొన్నాడు. అతని ఇంట్లో అతడే వంట చేస్తాడా! అతని ముగ్గురు భార్యల్లో ఎవరైనా. చేస్తారా? అతడికి ముగ్గురు భార్యలు. వాళ్ళు ఎప్పుడూ బాలింతలుగానో, చూలింతలుగానో ఉంటారు.

సంవత్సరంలో నెల విడిచి నెల ఆరునెలలు ఇంటిపట్టున శంభుదాసు ఉండదు. ఇష్టం వచ్చినట్లు తిరుగుతాడు. మాదిగపల్లెల్లో  మాదిగల వంశవృత్తాంతాలు చెబుతాడు. ఎవరూ రమ్మని ఆహ్వానించనక్కరలేదు. ఇష్టమయిన మాదిగపల్లెలో, ఇష్టమయిన ఇంటిలో ఆహారదీక్ష

ప్రకటిస్తాడు. వాళ్ళు ఉన్నా లేకున్నా అన్నీ సమకూరుస్తారు. అది మాదిగపల్లె బాధ్యతగా భావిస్తారు. ఇంక సంవత్సరం దాకా ఆవూరు రాడు. ఏవూర్లోనూ రెండో రోజుండడు. ఏకభుక్తం.

దాసు భార్యలు ధరణికోట లోనే ఉన్నారు. రోజూ అమరలింగేశ్వర పూజ, ప్రదక్షిణం చేసి వస్తారు. కృష్ణలో ముందుగా స్నానం. శంభుదాసు ధరణికోటలో ఉన్నప్పుడు ఆడవాళ్ళు అతణ్ణి పోషిస్తారు. దాసు పనీపాట లేకుండా ఉంటాడు.

దాసు ఇళ్ళలో ఆడవాళ్ళు వడ్డించరు. వండి తెచ్చిపెడతారు. ఇంట్లో మగవాళ్ళు అందరూ కలిసి కూర్చుని భోజనం చేస్తారు. 'మౌనేన భోక్తవ్యం!' ఎవరూ మాట్లాడరు. అదికావాలి ఇది కావాలి అని కానీ, అది వద్దు, ఇది వద్దు అని కానీ అనరు. వినరు. మగవాళ్ళ భోజనం తరువాత ఆడవాళ్ళు తింటారు.

దాసు ముందుగా భోజనం చేసి త్రేన్చాడు. తృప్తిగా తిన్నాడు. దాసు పొరపాటునగాని, తన కొడుకును భోజనానికి రమ్మని పిలుస్తాడేమోనని పార్వతమ్మ భయపడింది. దాసు సేవకుడికి వడ్డించాడు. మిగిలిన అన్నం కూరలు కుక్కకు వేశాడు. అది తినలేక వదిలేసింది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అది నేల పాలయింది. మిగిలిపోయిన వెచ్చాలు, కూరగాయలు సరుకులు పొట్లాలు కట్టి సేవకుడు సంచిలో వేసుకున్నాడు. దాసు పాత్రలన్నీ కడిగి బోర్లించాడు. వాటి మీద నీళ్ళు చల్లింది పార్వతమ్మ. ఆపైన సున్నపునీళ్ళు చల్లింది. కర్రపుల్లతో తిరగేసింది. సున్నపునీళ్ళు చిలకరించింది. ఇక ఆ పాత్రల్ని తాను వాడుకోగలదు.

'నా ఆహారదీక్ష సంతృప్తిగా నెరవేరింది' అన్నాడు, నవ్వి శంభుదాసు. పార్వతమ్మ చేతులు కట్టుకొని నిలబడింది. బుజ్జోడు మంచం మీదే కూర్చుని కాళ్ళూపుతున్నాడు.

'బాబూ! నువ్వు వృద్ధిలోకి వస్తావు!' అది ఆశీర్వాదం. చేయెత్తి దీవించాడు.

బుజ్జోడికి ఏమనాలో తెలియదు. వాడి అయ్యవారు 'లెక్కలు బాగా చేశావురా' అంటే నవ్వినట్లు నవ్వాడు.

'పార్వతమ్మా! నీ కొడుకు గొప్పవాడవుతాడు మీ వంశాన్ని ఉద్ధరిస్తాడు' అన్నాడు.

చేయెత్తి దీవించాడు. సేవకుడు నెత్తిన మూట, భోజాన సంచీ తగిలించుకొన్నాడు. పొన్నుకర్ర తాటించుకొంటూ శంభుదాసు బయలుదేరాడు. వెంట సేవకుడు. వెనక కుక్క! బాగా బలిసి ఉంది. ఊరూరూ తిరుగుతుంది కదా శరీరం వ్యాయమం చేసినట్లు రాటుదేలింది. ఉదయం వచ్చినప్పటినుండి వెళిపోయేదాకా మొరగలేదు. ఎవరినీ కరవలేదు. కుక్క మొరగక, కరవక పోతే కుక్క అవుతుందా? అవుతుంది కాబోలు! అది చేసిన పనంతా శంభుదాసుతో రావటం, భోజనం చేయటం, వెంట వెళిపోవటం.

'నాకు శంభుదాసు నచ్చలేదు' అన్నాడు బుజ్జోడు. ఆమాట పెద్దవాళ్ళే అనరు.

'ఎందువల్ల?'

'అంత అన్నం పాడుచేయటంవల్ల!'

'కుక్క తింటదనుకొన్నాడేమో!'

'అదెంత తినగలుగుద్దో దాసుకు తెలవొద్దా?'

పార్వతమ్మ మాట్లాడలేదు.

'నేనెంత తినగల్నో నీకు తెలిసినట్లు ఆ పెద్దమనిషికి తెలియకపోతే ఎట్టా?'

'నీకు ఆకలిగా ఉందా?'

'లేదు!'

'నీకు దాసు అన్నం పెడితే తినేవాడివా?'

'తినను!'

'ఎందువల్ల?'

'కక్కిన కూటి కాసెపణ్ణు!'

'అంటే ఏందిరా!'

'అది మనం పెట్టిన బిచ్చెం. బిచ్చగాడి బొచ్చెలో కూడు తీసుకు తినే వంసెంవా మంది?'

'పెదనాన్న వాళ్ళ ఇంట్లో తినొత్తావా?'

'తిన్ను!'

'మీ నాయనొచ్చిందాకా ఉంటావా?'

'ఉంటాను.'

❊ ❊ ❊

రామానుగ్రహశాస్త్రి ఉదయంనుంచి, పరమపదించి స్వర్గసుఖాలు అనుభవించే పితృదేవులు కీర్తిశేషులు శరభయ్యశాస్త్రి, శ్రాద్ధకర్మలు చేస్తూ తండ్రి కష్టమైన భోజన పదార్థాలు సిద్ధం చేశాడు.

పులిహోర, దద్దోజనం, మల్లెపూలవంటి అన్నం, ముద్దపప్పు, ఊరగాయ పచ్చళ్ళు, ఆవునేయి, ఒక్కచోట ఉంచాడు. గారెలు, పెరుగువడలు, పకోడీలు ఒక పక్క పెట్టాడు. నేయి, పాలు, పాయసం, పెరుగు, ఒకపక్క ఉంచాడు. బందరులడ్డు, చేబ్రోలు జిలేబి, గుంటూరు మైసూరుపాకు, చక్కెరకేళీలు, నారింజకాయలు, జామకాయలు, ఒకపాత్రలో ఉంచాడు. తమలపాకులు, వక్క, సున్నం ప్లేటులో పెట్టాడు.

భోక్త కోసం చూస్తున్నాడు.

రామానుగ్రహశాస్త్రి మొన్న సాయంకాలం రెండు కొబ్బరి చిప్పలముక్కలు మాత్రమే తిన్నాడు. నిన్న ఏమీ తినలేదు. ఆకలి విపరీతంగా అవుతూ ఉంది. కళ్ళు తిరుగుతున్నట్లు కూడా ఉన్నాయి.

'భవతీ భిక్షాం దేహి' వాళ్ళుకానీ, 'అమ్మా అన్నం పెట్టు' వాళ్ళు కానీ రాలేదు.

భోక్త కోసం వెదుకులాట ప్రారంభమయింది. భోక్త తినకపోతే తాను తినలేదు. ఆకలి చెడ్డది. భోక్త కంటే ముందే భోజనం చేద్దామా అనిపించింది. ఉదయం నుంచి రామానుగ్రహశాస్త్రి ఏమీ ఎంగిలి పడలేదు. ఆకలయినా, అపచార మని ఏమీ తినకుండా మానేశాడు. వంట చేస్తూ రుచులు కూడా చూడలేదు.

ఒక్కభోక్త దొరికితే చాలు. తాను భుజించగా మిగిలిన పదార్థాలు తినవచ్చు. బాగా ఆకలయినవాడు, బాగా తినగలిగిన వాడు, ఉదయం నుంచి ఏమీ తిననివాడు భోక్తగా దొరికితే, తిని త్రేనిస్తే, స్వర్గంలో ఉన్నతన తండ్రి తృప్తిపడతాడు.

తన తండ్రికి తాను చేస్తున్న మొదటి శ్రాద్ధ కర్మ ఇది. పూజాదికాలకు కొదవలేదు. భోక్త కొదవే.

శాస్త్రి కడుపులో జఠరాగ్ని జాజ్వల్యమానంగా నాలుకలు చాస్తూ మండుతూ ఉంది. నేయి పోస్తే మంట మరింత లేచినట్లు, పదార్థాలను చూస్తుంటే ఆకలి అధికం అవుతూ ఉంది.

భోక్త తొందరగా దొరికితే బాగుండును. ఎవరూ ఇంటిముందుకు రాలేదు. వీధిలోకి పోయి చూడాలి. ఆహారపదార్థాలు భద్రంచేసి, తలుపువేసి, తాళంవేసి, వీధిలోకి వచ్చాడు శాస్త్రి. ఏబిచ్చగాడూ కనిపించలేదు. ఇంత పొద్దెక్కిందాకా బిచ్చగాళ్ళు మాత్రం వీధుల్లో ఎందుకుంటారు?

వేసవికాలం మిట్టమధ్యాహ్నం ఎండమండుతూ ఉంది. వళ్ళు కాలుతూ ఉంది. చొక్కాలేని శరీరం. లోపలా కాలుతున్న కడుపు. చెమట పడుతూ ఉంది. గాలి ఆడటం లేదు.

భోక్త దొరకలేదు.

అంగట్లో అన్నీ ఉండి, అల్లుడి నోట్లో శని అన్నట్లు, అన్నీ చేసిపెట్టి, భోక్త దొరక్క తండ్రి మొదటి శ్రాద్ధకర్మనాడు, తండ్రిని నిరాహారంగా ఉంచే దౌర్భాగ్యం తనకు పట్టకూడదని రామానుగ్రహశాస్త్రి చింతాక్రాంతుడవుతున్నాడు.

ఆ చింతలో కొంతభాగం, తనకు తెలిసినా, తెలియక పోయినా, తన ఆకలిబాధ కూడా ఉంది.

తనలాంటి, తనతండ్రిలాంటి, నలుగురు భోజన ప్రియులు తుష్టిగా తినగలిగినంత చేసి ఉంచాడు. భోక్త తినిపోగా మిగిలిన పదార్థాలన్నీ తృప్తిగా తినాలి. ఎంత కాలమయిందో, కడుపునిండి తిని.

సాధారణంగా బిచ్చగాళ్ళు సత్రంలోకానీ, రైల్వేస్టేషన్ ప్లాటుఫారంమీదకానీ, కూర్చునో, పడుకొనో కనబడవచ్చు. ముందుగా సత్రానికి, ఆపైన అటునుంచి అటే స్టేషనుకు పోవచ్చు. భోక్త దొరుకుతాడు.

పండు వృద్ధుడు. చెప్పుల్లేని కాళ్ళు, చొక్కాలేని శరీరం, వేడెక్కిన డొంకలోని ఇసుకనేల, కాలుతున్న కాళ్ళు, మాడుతున్న తల, నెత్తిన గుడ్డకూడా లేదు. పడుతున్న చెమట, గాలి తోలటం లేదు.

భోక్త దొరికితే తండ్రి ఆత్మకు శాంతి.

సత్రంలో సన్యాసులు, బైరాగులు, బిచ్చగాళ్ళు నిద్రపోతున్నారు. వాళ్ళను లేపటం బ్రహ్మప్రళయం అయింది. ఒక్కడు నిద్ర లేచాడు. చికాకుగా చూశాడు. ఏం కావాలన్నాడు? భోక్త కావాలంటే రాను పొమ్మన్నాడు.మరొకణ్ణి లేపాడు. నిద్ర ఎందుకు పాడుచేస్తున్నావని కసురుకొన్నాడు. భోక్త కావాలంటే తినిపడుకొన్నానని చెప్పాడు. ఏమనుకున్నాడు? లేచి కూర్చున్నాడు. ఈశాన్యం  మూల చూపించాడు. వాడు నిన్నటినుంచి **ఏమీ** తినలేదు. నిన్నంతా జొరం. ఇవాళ మేలే. నీరసం, వత్తాడేఁవో కనుక్కో!' అని చెప్పాడు. రామానుగ్రహశాస్త్రి. ఆ మూల పురుషుడి దగ్గరకు పోయి తట్టిలేపాడు.

బైరాగి నిద్రలేచాడు కానీ కళ్ళు తెరవలేదు. 'నన్ను నిద్రపోనీయ్' అన్నాడు. రామానుగ్రహశాస్త్రి 'నాకు బిచ్చం పెట్టమ'న్నాడు. 'అన్నదానం చేయమ'న్నాడు. 'నేనా?' అన్న బైరాగి కళ్ళు తెరిచాడు. 'నా ఆకలి తీర్చ'మన్నాడు శాస్త్రి. అంతటితో ఆగలేదు. 'నా తండ్రి ఆత్మకు శాంతి కలిగించమ'న్నాడు. 'నీకు పుణ్యం వస్తుంద'న్నాడు.

'నాకాడేం లేదన్నా'డు బైరాగి

'నా దగ్గరుందన్నాడు' శాస్త్రి.

బైరాగి లేచి కూర్చున్నాడు.

'ఏమిటి నీ గోడు?' అని ప్రశ్నించాడు.

'నేను చేసిన వంట నువ్వు తిని పెట్టాలి'

'మగవాడి వంట నేను తిన్ను'

'బాబ్బాబు ఆడవాళ్ళ కంటే బాగా చేస్తా! చూడు! రుచి చూశావంటే వదలవు'

'ఎండలో నేను రాను స్వామి నన్నొదిలేయ్'

'కాదు బాబూ నామాట విను, నువ్వు తింటే  మాయిద్దరి ఆత్మలు శాంతిస్తాయి?'

'అంటే ఏమిటి?'

'భోక్త కావాలి, తమరు కావాలి. ఇవి చేతులు కావు. దయ చేయండి'

బైరాగికి నిద్రమాయమయింది. విషయం అర్థమయింది. లేచి కూర్చున్నాడు. తల జుట్టంతా అట్టలు కట్టుకుపోయింది. గెడ్డం గుండెదాకా పెరిగింది. మొలమీద అంగవస్త్రం గోచీకంటే శ్రేష్ఠంగా ఉంది. ముసలి బక్కప్రాణం. కాళ్ళు గోగుపుల్లల్లాగా ఉన్నాయి. పొట్ట వెన్నుముకకకు అతుక్కుపోయింది. పక్కనే త్రిశూలం, తలకింద సంచి.

బ్రతిమాలగా బామాలగా బైరాగి లేచాడు. వేడుకోగా వేడుకోగా పాంకోళ్ళు తొడుక్కొన్నాడు. త్రిశూలం చేత బుచ్చుకొన్నాడు. సంచి చంకకు తగిలించుకొన్నాడు. అది చేతికర్రలాగా ఊతం కాగా నడక సాగించాడు. రెండడుగులు వేసి 'ఎంతదూరం'? అన్నాడు. 'ఇక్కడే' అన్నాడు శాస్త్రి. రెండుఫర్లాంగుల్లో పన్నెండు సార్లు 'ఎక్కడ?' అన్నాడు బైరాగి. అన్నిసార్లూ 'ఇక్కడే' అన్నాడు శాస్త్రి.

బైరాగి కాళ్ళూ, చేతులూ, ముఖమూ, శరీరం స్నానం చేసినంత బాగా కడుక్కొని పాంకోళ్ళు వదిలి, శూలం గోడవార నిలబెట్టి, సంచి మేకుకు తగిలించి, ముఖం చేతులు తుడుచుకొని, ఆకు ముందు కూర్చుని ఆచమించి, 'ఏం వడ్డించదలుచుకొన్నావో, వడ్డించుకో!' అన్నాడు.

శాస్త్రి వడ్డన ప్రారంభించాడు. బైరాగి మంచి భోక్త. పిట్టమెతుకుల వాడు కాదు. అతను అన్నం తింటున్న తీరు చూస్తుంటే శాస్త్రికి ఆకలి రగులుతూ ఉంది.

బైరాగి ఒక్కొక్క పదార్థం రుచిచూచి, ఒక క్రమంలో ఒక పద్ధతి ప్రకారం, తింటున్నాడు. మంచి భోక్తని స్వర్గంలోని తన తండ్రి సంతుష్టుడవుతారు.

శాస్త్రి గృహస్థుధర్మాన్ని , మర్యాదను బాగా కాపాడుతున్నాడు. బైరాగి అతిథి, భోక్త భోజనప్రీతిని బాగా అనుభవిస్తున్నాడు. వరసపెట్టి తింటూ ఒక్కొక్క పాత్ర ఖాళీ చేస్తున్నాడు.

బాగా తింటున్న బైరాగిని చూచి, శాస్త్రికి అనుమానం బయలుదేరింది. అన్ని ఆహారపదార్థాలు తినేసేటట్టున్నాడు బైరాగి. అతడన్నీతింటే, తనకేమీ మిగలకపోతే ఎలా? అన్ని పదార్థాలు అతడిఎదుటే పెట్టాడు లోపల ఏమీ లేవు.

నాకేమీ ఉండవనుకొంటే శాస్త్రికి ఆకలికాసాగింది. కడుపు మండిపోతూ ఉంది. ఏమయినా సరే భోక్తకు తృప్తిగా పెట్టి పితృదేవులకు సంతుష్ఠి కలిగించాలని నిశ్చయించుకొన్నాడు శాస్త్రి.

శాస్త్రి వడ్డిస్తున్న కొద్దీ బైరాగి తిన్నాడు. బైరాగి తిన్నట్టల్లా శాస్త్రి వడ్డించాడు. అన్ని పాత్రలూ ఖాళీ అయ్యాయి. బైరాగి తేన్చాడు. 'ఇంతేనా! ఇంకా ఏమైనా ఉన్నాయా!' అని అడిగాడు. శాస్త్రి పైకి లేచాడు. మరేమయినా తెస్తాడేమోనని సందేహించి 'అక్కరలేదు, కూర్చో!' 'పదార్థాలు రుచిగా ఉన్నాయి. తృప్తిగా భోజనం చేశాను. చాలాకాలమయింది ఇంత తృప్తిగా తిని. నీ పితృదేవులు సంతృప్తులవుతారు. శుభం' అని లేచాడు.

బైరాగి వెన్నంటి ఉన్న పొట్ట కొంచెం వెన్ను విడిచి ముందుకు వచ్చింది. అంతే! తిన్నదంతా ఆ ఉదరంలో ఎక్కడ ఇమిడిపోయిందో ఆశ్చర్యం!

జఠరాగ్ని జ్వాలల్లో కడుపుకాలి, మాడి, బూడిదయి పోయింది. బైరాగి సంచి చేతబట్టి, త్రిశూలం అందిపుచ్చుకొని, పాంకోళ్ళు తొడుక్కొని బయటికి వచ్చాడు. శాస్త్రి భోక్తతో పాటు వెలుపలికి వచ్చాడు. 'నేను పోతా, నువ్వుండు' అన్నాడు. శాస్త్రి ఆగిపోయాడు. బైరాగి వెళిపోయాడు.

తినటానికి ఏమీ లేదు. వండుకోవటానికి ఓపికలేదు. వంటగదికి, పడగ్గదికి, నాలుగైదుసార్లు తిరిగాడు. మరచెంబులో నీళ్ళు గ్లాసులో పోసుకోబోయి మరచెంబే ఎత్తిపట్టి గటగటా కడుపునిండా నీళ్ళు తాగాడు.

తాతలనాటి పందిరిమంచం, ఉదయం నిద్రలేచి నప్పుడెట్లా ఉందో, ఇప్పుడూ అట్లాగే ఉంది. ఉక్కగా ఉంది. కిటికీ లోంచి వేడిగాలి అప్పుడప్పుడూ వస్తూ ఉంది. అదే సుఖం, శాస్త్రి మంచంమీద పడిపోయాడు. నిద్రపోయాడో, మరేమన్నా అయ్యాడో తెలియదు.

శాస్త్రికి ఏమన్నా అయితే వేణుగోపాలస్వామిని ఎవరు చూస్తారు? ఎవరు కాపాడతారు? ఎవరో ఒకరు వస్తారా? వస్తే ఎప్పుడు వస్తారు? ఎలా వస్తారు? అజాపజాలేని కొత్త పూజారి అకస్మాత్తుగా వస్తాడన్న నమ్మకమేముంది? పూజ ఎట్లా? గుడి ఎట్లా? గుడి పాడుబడితే దేవుడేం కావాలి? వేణుగోపాలస్వామి స్థితేమి? గతేమి? వేజండ్ల ఏమవుతుంది?

పూజారి కావాలి. తానింక గుడి బాధ్యత వహించలేడు. తన అన్నలు పూజారులు కాలేరు. అన్నల పిల్లలు చదువు సంధ్యలు ఈ పనిచేయనీయవు. ఎవరినైనా దత్తత చేసుకోవచ్చు ఎవరిస్తారు? ఎవరు వస్తారు? తనకూ ఆస్తిపాస్తులు లేవు. దేవుడికీ ఆదాయం లేదు. డబ్బులేని చోట దత్తత జరిగే పనికాదు. డబ్బులేని చోట ఏ పనీ జరగదు. డబ్బులేకపోతే దేవుడు కూడా చెల్లడు. డబ్బులేని దేవుడి గుడి పాడుబడుతుంది. వేణుగోపాలస్వామి ఆలయం పాడుబడుతుందేమోనన్న సందేహమే రామానుగ్రహశాస్త్రికి నిద్రపట్టకుండా చేస్తూ ఉంది. తన ఆకలి, దైవ పరిస్థితి వల్ల శాస్త్రి అశాంతుడయ్యాడు.

మగతనిద్ర, పీడకలలు, పితృదేవుడి స్వర్గం - నరకం శిక్షలు, రంపాలు, కాగుతున్న నూనె, వేగుతున్న శరీరం. ఆకలి, వేపుడూ బాగాలేదు. ఆకలి మంట. కాలుతున్న నరకం. మండేకడుపు. స్వర్గంలో ఎండ, ఉక్క చెమట. తన ఆత్మప్రమాణం, స్వర్గం వాకిలి బంద్. ద్వారపాలకుల హెచ్చరికలు. బార్లా తెరచిన నరక ద్వారం. ఖాళీ కడుపు. కదులుతున్న నీళ్ళు. ఏడీ వేణుగోపాలస్వామి. రాడేం? రక్షించడేం? నరకంలోకి లాగుతున్న చేతులు. ఏడుపు! ఆకలి, వేణుగోపాలస్వామి ఎక్కడున్నాడు? అష్టమహిషులు. పదహారు వేలమంది గోపికలు. ఇద్దరు భార్యలు? ఏరీ! లేరు! ఏమయ్యారు? ఏమో! నరకం వద్దు! స్వర్గం కావాలి! కేకలు, అరుపులు, తననెవరూ రక్షించలేదు.

సామిరారా! నా సామిరారా!

వేజండ్ల పురి వేణుగోపాలరారా!

నా సామి రారా!

నా బంగారు సామిరారా!

స్వామి రాలేదు. కనబడితే ఆపగాలి. నిలదీయాలి.

తలుపు తట్టిన చప్పుడు!

వేణుగోపాల స్వామి వచ్చాడు.

మళ్ళీ చప్పుడు!

'వేణుగోపాలస్వామి?'

'నేనే స్వామి వేణుగోపాలయ్యను!'

'ఏమి స్వామి!'

'నేనే స్వామి'

రామానుగ్రహశాస్త్రి మగత వదిలింది. ఎవరో తలుపు కొడుతున్న శబ్దం. వెళ్ళి తలుపు తీశాడు. వేణుగోపాలయ్య. పొగాకు వ్యాపారి. ఒకప్పుడు బాగా బతికాడు. ఇప్పుడు చితికిపోయాడు.

'తమరు గుడికి వేంచేయాలి స్వామి!' వేణుగోపాలయ్య చేతులెత్తి దండం పెడుతున్నాడు.

'నేను రాను. పూజ చేయను. గుడి తీయను. ఏమయితే అదే కానీ – నేను రాను!'

వేణుగోపాలయ్య బిత్తరపోయాడు. తటాలున కాళ్ళమీద పడ్డాడు. 'అట్టా అంటే ఎట్టా సామి! మా బతుకులేంగాను? మా మొక్కులు తీరే దెట్టా?'

'నాకు ఆకలి లేదా? అన్నం వద్దా? నేను తినరాదా? నా బతుకేం గావాలి? నన్ను పట్టించుకొన్నదెవరు? గుడిరాబడి ఏది? మాన్యాలు తోపులు ఆదాయం ఏమయింది? దేవుడెవడిక్కావాలి? పూజ ఎవడిక్కావాలి? పూజారి ఎవడిక్కావాలి? పూజారి చస్తే ఏం? బతికితే ఏం? మీ పూజలు జరగాలి. మీ మొక్కుబళ్ళు నెరవేరాలి. నేను రాను. పో! నీదిక్కున్న చోట పూజలు చేయించుకో, మొక్కుబళ్ళు చెల్లించుకో.'

'బాబ్బాబు!' పూజారి కాళ్ళు వేణుగోపాలయ్య వదల్లేదు.

'నా మొక్కు తీరాలి. వేణుగోపాలస్వామికీ మొక్కు. నా కోరిక తీరింది. స్వామి మహిమ, నా బతుక్కో దారి దొరికింది. మరోచోట ఈ మొక్కు చెల్లించలేను. మొక్కు తీర్చుకోకపోతే నరకానికి పోతాను.'

'నన్ను ఆ నరకం నుంచి. ఈనరకం నుంచి కాపాడేది ఎవరు? ఆకలితోచచ్చిపోతున్నాను, మూడు రోజుల్నుంచి అన్నం ముట్టలేదు.'

భక్తుడి నోటమాటలేదు. కానీ కాళ్లు వదల్లేదు. శాస్త్రి కూడా కాళ్లు విడిపించుకోలేదు.

పళ్ళెంలో పళ్ళు, పూలు, లడ్డులు, కారం బూంది, బియ్యం మూట, బెల్లంగడ్డ, టెంకాయ, ఊదుకడ్డీలు, పదిరూపాయల నోట్లకట్ట!

శాస్త్రి మెత్తబడ్డాడు. కాస్త చల్లబడ్డాడు. ఆపదలో మొక్కు కొన్నవాడి మొక్కు తీర్చే కోరిక నెరవేర్చాలనుకొన్నాడు.

## 4

శంభుదాసు తృప్తిగా భోజనం చేసి వెళ్లిపోయారు.

బైరాగి సంతుష్టి పొంది, సంతోషంగా సత్రం చేరాడు.

శంభుదాసుకు బైరాగికి ఏం సంబంధం?

బుజ్జోడు భోజనం తినితేన్చిన వాణ్ణి ఆసక్తిగా గమనించాడు.

రామానుగ్రహశాస్త్రి ఏమీ మిగల్చకుండా తినిపోయిన భోక్తను ఆవేదనగా చూశాడు.

బుజ్జోడికీ, శాస్త్రికీ ఏం సంబంధం?

* * *

బుజ్జోడు మంచంమీదే కూర్చున్నాడు. కాళ్ళూపుతూనే ఉన్నాడు. ఆకలి అవటం లేదు. అమ్మా అన్నం పెట్టు అనటంలేదు. ఆటలకు పోలేదు. నిద్రపోలేదు. కొడుకును చూచి భయపడింది పార్వతమ్మ.

పక్కింటిలో బుజ్జోడి పెద్దమ్మ ఉంది. పార్వతమ్మ వంట చేయలేదని గ్రహించింది. ఇంటికివచ్చి బుజ్జోణ్ణి ఇంటికి పోదాం రమ్మంది. సాధారణంగా అన్నం పెట్ట దలచుకొంటే ఇంటికి పోదాం రా అంటుంది. ఏమన్నా అరిసెలు గారెలు వండినప్పుడూ అలాగ్గే పిలిచేది. 'రారా నాన్నా! బుజ్జి కొండా' అంది.

'రాను పెద్దమ్మా!' అన్నాడు.

ఆమె బిత్తరపోయింది. ఎప్పుడూ అలా బదులు చెప్పడు.

'బువ్వ తిందువురా బుజ్జీ!'

'రాను పెద్దమ్మా!'

'ఆకలిగా లేదంటరా నాన్నా?'

'లేదు పెద్దమ్మా!'

'ఆడుకొందువురా కన్నా'

'రాను పెద్దమ్మా!'

పార్వతమ్మతో 'ఏంటే ఈడు?' అంది: 'నువ్‌బో! నేను బుజ్జితో మాట్టాడి పంపుతా'

పెద్దమ్మ వెళ్ళిపోయింది. పార్వతమ్మ కొడుకును అడిగింది 'ఆకలవటం లేదంటరా నీకు!'

'లేదమ్మా!'

'పొద్దుటి నుంచి ఏమీ తినలేదు. కొంచెం తిందువు రాపోదాం రా!

'నేను రాను, నువ్వుపో! తినిరా!'

పార్వతమ్మ కొడుకును తీసుకొని వెళ్ళి తన అక్క ఇంటిలో అన్నం తినిపించలేకపోయింది.

బుజ్జోడు బిర్రుగా ఉన్నాడు. తీక్షణంగా చూస్తున్నాడు. కన్నతల్లి బెదిరిపోయింది.

'తండ్రీ! నామీద కోపంవా?'

'అమ్మా! నువ్వు నా బంగారు తల్లివి. నీ మీద ప్రేమతప్ప నాకు మరేమీ ఉండదే నా పిచ్చి తల్లి!' అన్నాడు.

మాటలు ముద్దుగానే ఉన్నాయి. ముఖం గద్దరించి ఉంది. బుజ్జోడి అర్హతకు మించిన ఆలోచనలు వాడి బుర్రలో తిరుగుతున్నాయి. పసిగుండె ఆలోచనల బరువుకు ఊగిపోతూ ఉంది.

సంప్రదాయం, ఆచారం, విశ్వాసం, వంశప్రతిష్ఠమీద గౌరవం వాడి ముఖంలో సింహాసనం వేసుకొని కూర్చుని స్థిరపడుతూ, వేళ్ళూనుతూ ఉన్నాయి. పదేళ్ల పసివాడు అరవయేళ్ళ వృద్ధుడిలాగా దీక్షగా ఉన్నాడు. 'నేను అన్నదాతను' తేపతేపకూ తనలో తానే గొణుక్కొంటున్నాడు.

ఆకలికి తాళలేని కన్నతండ్రి బుజ్జోడు పెద్దవాడిలాగా శాంతంగా కూర్చుని ఉండటం మొదట ముచ్చట కలిగించింది. ఆపైన పార్వతమ్మకు భయం కలిగించింది.

ఎండనబడి, డొంకలో వస్తున్న బసవయ్యను చూచి, చిల్లకంప అలవకు పాతి ఉన్న కర్రల గేటు తీసి ఎదురు పోయి నెత్తిమీది మూట అందుకొని మోసి తెచ్చింది పార్వతమ్మ.

కొడుకు లేవలేదు. తండ్రిని చూచి ఎదురెళ్ళలేదు. చూచిన తండ్రి చేతుల్లోకి ఎగిరి దూకలేదు.

'ఏం నాన్నా వంటో బాగాలేదా?' అన్నాడు బసవయ్య.

'బాగుంది నాన్నా! రా! కూచో! ఎండలో వచ్చేవు! ఏమన్నా తిన్నావా? అమ్మా! అన్నం వండు. నాన్నకు తొందరగా పెట్టు! ఎప్పుడు తిన్నాడో ఏమో! కూచో నాన్నా' అన్నాడు.

తండ్రి కాళ్ళు కడుక్కొని వచ్చాడు. కొడుకు పక్కన కూర్చున్నాడు. భుజంమీద చేయివేశాడు. భార్య జరిగిందంతా చెప్పింది. శంభుదాసురాక పోక చెప్పి జరిగిందంతా వివరించి, వంటపనిలో మునిగి పోయింది.

'నాన్నా! నేను ఊళ్ళోకి పొయొస్తా!'

'ఎందుకురా?'

'పుస్తకాల కోసం'

'పదా నేను వస్తా'

ఇద్దరూ వేణుగోపాలస్వామి దేవాలయం మీదగా, రామానుగ్రహ శాస్త్రి ఇంటి పక్కగా గ్రామ పంచాయితీ గ్రంథాలయం కాడికి పోయారు.

'సార్ నాకు పుస్తకాలు కావాలి!'

'ఏం పుస్తకాలు? పిల్లల పుస్తకాలా?'

'కాదు పెద్దల పుస్తకాలు. వేదశాస్త్ర పురాణాలు'

'అవి నీకెందుకురా?' లైబ్రేరియన్ అదిరిపోయి భయపడి అడిగాడు.

'చదువుతా!'

'నువ్వు చదవలేవు'

'లేదు, చదువుతా'

'అవేవీ లేవుగాని, బసవపురాణం ఉంది. చదువుతావా?'

'ఆఁ! చదువుతా అది మానాన్న పురాణం. మాదే!'

అతడు పుస్తకం ఇచ్చాడు. పేరు రాసుకొన్నాడు. సంతకం చేయించుకొన్నాడు. తండ్రి వేలిముద్ర వేయించుకొన్నాడు. కొత్తపుస్తకం కొత్త వాసనింకా పోలేదు. బుజ్జోడు మూచ్చాశాడు. ముద్దు పెట్టుకొన్నాడు, తెలుగే!

'చదవగలవా?' లైబ్రేరియన్ అడిగాడు.

'ఆఁ!'

తిరిగివస్తుంటే బసవయ్యకు చాలా సంతోషంగా ఉంది. కొడుకు లైబ్రరీ పుస్తకం తీసుకొన్నందుకో ఆనందం, చదువుతానంటున్నందుకో ఆనందం, తన పేరుతో పుస్తకం ఉన్నందుకో ఆనందం.

తోవలో కొడుకును అడిగాడు. నాపేరిట ఒక పురాణం ఉందా?

'ఉంది నాన్నా; ఇదుగో, ఇది బసవపురాణం. నీదే! నిజం చెప్పనా? మనకో పెద్ద పురాణం ఉంది'

తోవలో పుస్తకం తెరిచి కూడబలుక్కొంటూ చదువుతున్నాడు బుజ్జోడు. ఏదో అర్థమవుతున్నట్లే ఉంది.

ఇద్దరూ ఇంటికి వచ్చారు.

భోజనం సిద్ధంగా ఉంది. ఇంకా పొద్దు మునగలేదు. పార్వతమ్మ అన్నం తండ్రికీ

కొడుక్కీ వడ్డించింది. ఇవాళ మొదటిసారిగా, తల్లితో తినే కొడుకు, తండ్రి పక్కన కూర్చుని అన్నం తింటున్నాడు.

తిని చేతులు కడుక్కొంటున్న కొడుకును తల్లి అడిగింది. 'పెద్దమ్మ బువ్వ పెడతానంటే ఎందుకు తిన్లా?'

'ఒకరోజు బువ్వ తినకపోతే ఏమీ గాదు. ఒకరోజు ఏందన్నా సదవకపోతే శానా నష్టమొచ్చుద్ది నాకు, వొంశానికి, జాతికి! నేను వేదశాస్త్ర పురాణాలు సదవాలి'

తల్లిదండ్రులు బిత్తరపోయారు. తల్లి ఆముదం దీపం ముట్టించింది. బుజ్జోడు బసవ పురాణం చదువుకోసాగాడు.

※ ※ ※

వేజండ్ల పురి వేణుగోపాలస్వామి గుడిలో, గర్భగుడిలో, వేణుగోపాలయ్యకు హారతి ఇచ్చి, దక్షిణ తీసుకొని, అతణ్ణి ఆశీర్వదించి పంపించాడు రామానుగ్రహశాస్త్రి.

ఆకలిగా ఉంది.

లడ్డు, కారబ్బూంది, కొబ్బరిముక్కలు పళ్ళు తిని, తృప్తిపడి, గుడికి తాళం వేసి, పడిపోతున్న పాత పెంకుటింటిలో పందిరి మంచం కాడికి చేరాడు శాస్త్రి.

కిరసనాయిలు బుడ్డి ముట్టించాడు. వెలుతురు ఇల్లంతా పరుచుకొంది.

※ ※ ※

నిజానికి ఇవి రెండు కథలు.

ఒక కథ బుజ్జోడిది. రెండోది రామనుగ్రహశాస్త్రిది. రెండు కథలు కలగలిపి ఒక కథ అయ్యాయి. ఏం సంబంధం?

ఇవి కథలు కావా? జీవితాలా? దళిత జీవితాలా? బ్రాహ్మణ జీవితాలా? ఎందుకీ రెండూ ఒక జీవితంగా, కథగా కాగలిగాయి?

భిక్ష ఎవరు పెడతారు? ఎవరికి పెడతారు? ఎందుకు పెడతారు? ఎలా పెడతారు? అది వ్యవస్థలో భాగమా? సౌభాగ్యమా? సౌందర్యమా? అది శ్రమ జీవన పరాజయమా పరాభవమా?

ఈ రెండు జీవితాలకు మధ్య ఉన్నది ఏం సంబంధం?

అది వ్యవస్థ సురూపమా? కురూపమా?

ఇది వాలుతున్న పొద్దా? పొడుస్తున్న పొద్దా?

ఇది చీకటా? వెలుతురా? రాత్రా? పగలా? ఇదేం సంబంధం?